829

కథాకథన



ఏ.పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయం
గ్రంథ సంఖ్య 21345
కేది
కడప - 516 004.

తిని
పారాయణ
21345

సి.నారాయణరెడ్డి

829

మా వూ రు మా ట్లా డిం ది

(వ్యా స సం పు టి)

డా॥ సి. నా రా య ణ రె డ్డి

సి.పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయము
ప్రవేశ సంఖ్య 2134
తేది
కడప - 516 004.

Prof. B. Rama Raju (Rtrd)
H. No. 1-8-117/2, Chikkadpally,
HYDEI ABAD - 500 020.

మనస్వినీ ప్రచురణలు
హై ద్రా బా దు

మార్చి 1980
ప్రతులు : వేయి

మూల్యం :
అయిదు రూపాయలు

ప్రతులకు :
ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
సికింద్రాబాదు

ముద్రణ :
శ్రీ మాధవి ఆర్ట్ ప్రింటర్స్
కుత్బిగుడ, హైదరాబాదు-27.

కృతజ్ఞతలు

సిద్ధిపేటలో

నన్ను సన్మానించడంతోపాటు

ఈ వ్యాససంపుటిని

వెలువరించిన

సన్మాన సంఘం సభ్యులకూ

జానపద సాహిత్య పరిషత్, మెదక్ శాఖకూ.

— సి. నారాయణరెడ్డి


ఈ సంపుటిని గూర్చి

—డా. సి. నారాయణరెడ్డి

1970 లో అనుకుంటాను. తెలంగాణా (కరీంనగరం) మాండలిక భాషలో ఒక ఆరుపాటలు వ్రాశాను. అంతే. ఆ తరువాత నా కలం ఎన్నెన్నో వచన కవితల్ని పలికించింది. ఆరింటితోనే ఆ పాటల రచన ఆగిపోయింది. మరికొన్నేళ్ల తరువాత మా ప్రాంతంలో వాడుకలోవున్న మాండలిక పదాలను తీసుకుని సరదాగా వ్యాసాలు వ్రాయాలనిపించింది. అలా వ్రాసిన ఆరు వ్యాసాలను "మా పూరు మాట్లాడింది" శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురించాను. ఆ వ్యాసాలు అప్పుడు పొందిన ఆదరణం దృష్ట్యా ఇప్పుడు ఈ పుస్తకరూపంలో వెలువరిస్తున్నాను.

ఈ సంపుటిలో మొదటి భాగంలో జానపద గీతాల్లోనూ, జానపదుల వ్యవహారంలోనూ వున్న పదాలను గూర్చి చర్చించాను. రెండో భాగంలో నేను జానపదగేయ సరళిలో వ్రాసిన పాటల్లోని మాటలను గూర్చి పరిశీలించాను. మొత్తానికి ఈ వ్యాసాలన్నిటిలోనూ పాటల్లోని మాటల మాటున వున్న మాటలనుగూర్చి, మాటలపెనకాల మారు రూపాల్లో వున్న మాటలను గూర్చి చర్చ వుంది. అయితే ఈ చర్చ భాషావ్యాకరణ సూత్రాల పరిధిలో గిరిగీసుకుని వున్నదికాదు. కొంత శాస్త్రీయంగా, కొంత చమత్కారంగా, కొంత చలోక్తికంగా జరిపిన పద పరిశీలన ఇది. అయితే కొత్తగా చెప్పాలన్న కుతూహలం వల్ల కొన్ని ప్రమాదాలు దొర్లినా ఆశ్చర్యం లేదు.

మొదటి భాగంలో ఎన్నెన్నో మాటల మూటల్ని నాకందించిన పసుల పోశమ్మకు ఈ సంపుటిని అంకితం చేస్తున్నాను. ఇంతకూ పసుల పోశమ్మ ఎవరు? కొంత యథార్థం, కొంత కల్పన కలబోసి రూపొందించిన అపురూపమైన పాత్ర.



మా వూ రు మా ట్లా డిం ది

—తో టి ను డు గు

మా వూరు మాట్లాడింది-1

'పట్నం నుంచి ఎప్పుడొస్తిరి బాంచను?' ఆప్యాయంగా అడిగింది పసుల పోశమ్మ. "పొద్దున్నే వచ్చిన పోశమ్మా. ఇంకా ఆ బాంచనేమిటి? కాలంమారి" ..... నా మాటకు మధ్యలో అడ్డొచ్చి పోశమ్మ అన్నది. "అడేంది బాంచను! ఏది మారితేంది మేం మీ గులాపోల్లం". నా బుర్రలో గిర్రున తిరుగుతున్నాయి ఆ రెండుమాటలు "బాంచను", "గులాపోల్లం".

ఎక్కడివీ మాటలు! ఎప్పటివీ మాటలు! అలనాటి విషవృక్షం లాంటి నైజాం నవాబు ఫ్యూడల్ వ్యవస్థకు పూచిన పిచ్చిపూలవి. ఇలాంటివి ఎన్నెన్నో ఎప్పుడో రాలిపోయినవి. ఇంకా మిగిలివున్న వాటిలో ఇవి కొన్ని. "బాంచను" అంటే "బానిసను". "గులాపోల్లం" అంటే "గులాములం". బానిసతనానికి, వెట్టిచాకిరికి ఇంకా మిగిలివున్న శిధిల పదశేషాలివి.

"మస్కుల లేసినా పని ఒడుస్తలేదయ్యా"— పోశమ్మ ఉవాచ. మళ్ళీ రెండు మాటల మీద తిరుగుతున్నది నా మనస్సు. "మస్కుల, ఒడుస్తలేదు." ఒడుస్తలేదంటే పూర్తి కావడంలేదని. ఇది నేను మావూళ్లో చిన్నప్పటి నుంచి వింటున్నమాటే. "నాలుగు మక్కంకులు పంపించు". "నిన్ననే ఒడిసిపాయె". "ఒడిసిపాయె"—"వడియు" అనే క్రియ వుంది. కారడం ఇంకడం అనే అర్థంలో. ఒడిసి పోవడమంటే ఇదే. అయిపోవడమన్న మాట. మరి "మస్తుల" సంగతి. మస్కుల, మబ్బుల అనే రెండు మాటలు తెలతెలవారు జామున అనే అర్థంలో వాడుకలో వున్నాయి. ఈ రెండు మాటలు మనసం చేసుకుంటూ వుంటే మరికొన్ని పదాలు బిలబిలా మూగుతున్నాయి. "ఆంబటాల్ల, ఎండుగులాల్ల, పసులాల్ల, ఎసర్లాల్ల, గైరాల్ల"—అమ్మో! ఎన్నెన్ని ఆల్లలు. ఏమిటీ ఈ ఆల్లలు. ఆల్లలంటే—యాల్లలు—వేళలు. మస్కుల మొదలుకొని గైరాల్ల వరకు అన్నీ వేళా విశేషాలే.

"మస్కుల" అంటే మసకవేళ. "మబ్బుల" అన్నా మసకవేళే. మసకకూ, మబ్బుకూ ఇక్కడ ఒకే అర్థం. అంటే వేకువజామున అని. చీకటి పోలేదు; వెలుతురు రాలేదు. ఈ రెంటికి మధ్యస్థితి మసకవేళ, మబ్బువేళ.

"కండ్లకేమన్న మబ్బు గమ్మిందా" అనే అదలింపులోని మబ్బు మసకే.

పొద్దు పొడిచింది. బారెడెక్కింది. జాము సేపయింది. చేలలో, పొలాల్లో పనిచేసే రైతులకు అన్నమో, అంబలో తీసుకెళ్తారు భార్యలో, బిడ్డలో. అదే "అంబటాల్ల", పండిన ధాన్యం ఇంటికి తెచ్చి వాకిళ్ళలో ఎండబోస్తారు. "అంబటాల్ల"కు ఎండబోస్తే అది సాయంత్రం ఏ నాలుగు, అయిదు గంటల మధ్యో ఎండుతుంది. అదే "ఎండుగులాల్ల'. ఆగబోసిన ధాన్యం ఎండేవేళ. పశువులు ఇళ్లకో, కొట్టాలకో చేరేవేళ "పసులాల్ల". పొద్దువాలుతుంది. సాయంత్రం ఆరు గంటలు అయ్యీ కాకముందే పొయి రాజుతుంది. అన్నం ఉడుకుతుంది, ఎసరు దిగుతుంది. అదే "ఎసర్లాల్ల". ఇవి సరే. చివరి మాట మాటేమిటి? "గైరాల్ల" —ఇది ఏ వేళ? గజిబిజిగానే వుంది.

గైర్ అంటే పరాయి, తనది కానిది. గైర్+వేళ=గైరాల్ల. ఏమిటేమిటి? కంగారుపడకండి—"వేళ కాని వేళ" అనేది విన్నారు కదా! అదే ఈ "గైరాల్ల". —ఇంగ్లీషులో Odd time. "మస్కుల" నుంచి "ఎసర్లాల్ల" వరకు కానివేళ ఈ గైరాల్ల. అది జాములాత్రి కావచ్చు—అర్ధరాత్రి దాటిపోవచ్చు.

ఈ వేళల జోల్లో నేనుంటే పోశమ్మ సణుగుడు—వడ్లు చెరుగుతూ. "అన్నీ తర్రలే. అందరోలిగే మనం జేసినం. కాని పని అడ్డెమడ్డె మయి పోయిందయ్యా"—

"అడ్డెమడ్డెం"—మడ్డెల ముక్తాయింపుల్లా ధ్వనించిన పునరుక్తులు. మిగతా మాటలు ఎగిరిపోయినై. "అడ్డెమడ్డెమే" అద్దం లాంటి చెవిలో అగుపిస్తూ వినిపిస్తూ వున్నది. "అడ్డెమడ్డెమయి పోయింది" అనే వాక్యం వెనక ఊపిరి తీసుకునే నిట్టూర్పును బట్టి, ఆ వాక్యం నిరాశను పుక్కిలిస్తున్నదని తెలిసింది. కానీ మాటల తీగల మాటున దాగిన స్వరరహస్యాలు కనుక్కోవాలి కదా! మీటితే కదా అవి బయటపడేది.

"అద్దెమద్దెం" "ఓయ్"—"అర్థమర్థం"—ఏమిటి దీని అర్థం? అర్థం అంటే సగమా? ఔను సగమే. మరో అర్థమన్నా సగమేనా? ఔను సగమే. అర్థం అర్థం అంటే సగం సగం ఎందుకు కాగూడదు? ఎవరు కాదన్నారు మరి? అయితే సరి. "అద్దెమద్దెమయి పోయింది" అన్న పోశమ్మ వాక్కులో అర్థమర్థ మయిపోయింది. అంటే పూర్తిగా ఫలించలేదు అనే అర్థం సార్థకంగా పలి కింది యాసగా, పద విపరిణామ పరిశోధకులకు కొండంత ఆశగా.

మా వూరు మాట్లాడింది-2

చిరాకుతో నెత్తి గోక్కుంటున్న పసుల పోశమ్మ కనిపించింది దూరి చావిడి ముందు. "ఏమిటి పోశమ్మా చికాకుగా వున్నావు" అన్నాను. "ఏం లేదు బాబు!"—"అదుగో ఆ మాటే అనొద్దన్నాను." వెంటనే నాలుక కొరుక్కొని అసలు విషయానికి వచ్చింది పసులపోశమ్మ. "గా...అయ్య సినోడు గాడయ్యా—కైత్కాలోడు." తూమెడు వడ్లు కొలుస్తానని చెప్పి కుంచెడే కొలిచాడట. ఇవ్వవలసిన రూపాయలు ఇగో అగో అంటూ తియ్యతియ్యని మాటలు చెప్పి ఎగ్గొడుతున్నాడట. పోశమ్మ చెప్పిన వివరణను బట్టి "కైత్కాలోడు" అంటే ఎలా ఉండాలో నా బుర్రలో ఒక రేఖాచిత్రం గీసుకున్నాను. అతడు చమత్కారి కావాలి. ఆబద్ధాలకోరు అయివుండాలి. వంచనా శిల్పంలో గట్టులు ముటినవాడు కావాలి.

మరి ఈ కైత్కాలోడు అనే పదానికి ఇన్ని భావాంశలను మోసే శక్తి వుందా? లేకేమి? కైత్కాలోడు అంటే కవిత్వాలవాడు అన్నమాట. కవిత్వం అబద్ధమా? ఔను చాలావరకు. "నవ్వులా అవి కావు నవపారిజాతాలు" అంటే నిజమని సామాన్యుడు నమ్ముతాడా? కేవలం సత్యం చెప్పడానికి కవిత్వం అవసరం లేదు. అది చరిత్ర చెబుతుంది. పత్రికా ప్రకటన చెబుతుంది. గణిత శాస్త్రమూ చెబుతుంది. కవిత్వంలో అలంకారం ఎప్పుడు ప్రవేశించిందో అప్పుడు అనృతం ప్రవేశించింది. అయితే ఈ అనృతం భావుకులకు ఆలోచనామృతం. అది విషయాంతరం. "కవిత్వాల వాడు" అంటే చల్లని చమత్కారి. కమ్మని అబద్ధాలకోరు. మెత్తని వంచనాశిల్పి (భ్రాంతి కలిగించేవాడు). ఈ మూడు గుణాలు ఎంత దట్టంగా వుంటే అతడు అంత గట్టికవి అనే అభిప్రాయం లాక్షణికులది. మొత్తానికి ఈ "కవిత్వాల వాడు" పల్లెనోటిలో నలిగి "కైత్కాలోడు" గా మారింది. "వాని మాటలు నమ్మకు వట్టి కైత్కాలు" అనే వ్యవహారం కూడా వుంది. ఇలాంటిదే మరోమాట వుంది. 'యేతులోడు'. 'హేతువులవాడు' అన్న మాట. తర్కం పెట్టుకునే వాడు, వాదులాడేవాడు అనే అర్థంలో 'యేతులోడు'

వాడుకలో వుంది. కైక్తాలోడు, ఏతులోడు ఒకరకంగా ఏకోదరులే. 'ఏతు' అనే మాటకు ఉద్ధతి అనే అర్థం చెప్పింది శబ్దరత్నాకరం. నైషధంలోనుంచి ఈ పదమున్న పద్యాన్నికూడా ఉదాహరిస్తూ 'ఈ యర్థమింకను విచారణీయము' అని అప్పటికి తప్పుకుంది.

వీధిలో-కాదు-మాటలమీద నడస్తున్న నన్ను పోశమ్మ గొంతు ఉలిక్కి పడేట్టు చేసింది. "ఇప్పుడే కనిపించిండు, మాయిల్లమే మాయమైపోయిండు". ఓహో? పోశమ్మ ఆ కైత్కాలోడి సంగతే అంటున్నదనుకున్నాను. 'వెంటనే' అనే అర్థంలో 'మాయిల్లం' ప్రయోగించింది పోశమ్మ. విచిత్రమైన సంధికార్యం నా మనస్సులో మెరిసింది. మహా+వైళం=మాయిల్లం. అక్షరాలు ఎలా అరిగి పోయినవో; ఎలా కుదింపుగా ఒదిగిపోయినవో ఆశ్చర్యం వేసింది. మహా-మాగా పరిణమించింది. 'మాచేసినవులే'' అనే దాంట్లో వున్నది 'మహా చేసినావులే' 'మా లేస్క ఉంది' అనే మరో వాడుక ఉంది. మహాలెస్సగా అనేఅర్థంలో. వైళం వాడుకలో ఉన్నపదం కాదు. పోతన్న భాగవతంలో ప్రథమస్కంధంలో 'మత్సేవం బుట్టును వైళమ భావింపగ నాదు భక్తి' అని వుంది. ఎక్కడ బమ్మెర పోతన్న? ఎక్కడ పసుల పోశమ్మ? 'మాయిల్లం'లో మాత్రమే లేదు వైళం. విడిగా కూడా వ్యవహారంలో వుంది. 'యాల్లం' అని, 'యాల్ల మాయె' అంటే ఆలస్యమైంది అని. 'యాలాయే' వేరు. అది 'వేళాయె' అనే అర్థంలో వుంది. 'స్వాముల సేవకు వేళాయె వైళమ రారే చెలులారా' అన్న పింగళి పాట స్మృతిని తట్టి పలకరించింది.

"నేనేదన్న మాటంటే అజో తీర్గ అయిపోతవేం బాపూ!" పోశమ్మ ఉత్కంఠతో అడిగింది. మాండలికపదం వినగానే నా మనస్సు ఎలా పరిపరి విధాల పరుగులు తీస్తుందో; ఆ పదపరిశీలన జిజ్ఞాసలో నా ముఖకవళికలు ఎలా మారిపోతుంటాయో పోశమ్మకు వివరిస్తే ఇకనుంచి పలకడం మానేస్తుంది. నా పదాల సేకరణ ఆగిపోతుంది.

అందుకే వెంటనే అందుకున్నాను. "మరేం లేదు పోశమ్మా! ఏదో గుర్తుకొచ్చింది. అంతే. ఇంతకూ ఇప్పుడు రోజు కూలీ ఎంతిస్తున్నారు." అంటూ విషయం మార్చాలని ప్రయత్నించాను. 'ఏం కైకిలి బాపూ'—అంటూ

ఏదో గొణుక్కుంది పోశమ్మ. 'కైకిలి'—ఎప్పుడు వింటున్న మాటే అది. కానీ 'కై' ఏమిటి 'కిలి' ఏమిటి. తవ్వకం మొదలైంది. 'కై' అంటే చేయి అని కైదండ, కైకొనుట చెబుతున్నాయి. మరి 'కిలి' అంటే-ఏమో-'కూలీ' ఎందుకు కాకూడదు? కై+కూలి=కైకిలి. పాలేర్లు—వ్యవసాయ కూలీలు నెలసరి జీతానికి పని చేస్తారు. నాట్లకో, కలుపులకో, కోతలకో పాలేర్లతో పాటు కూలీలను పిలుస్తారు. ఏ రోజుకారోజుకే వాళ్ళ కూలీ డబ్బులు ముట్టచెబుతారు. సాయంత్రం కాగానే ఒక్కొక్కరిని పిలుస్తూ చేతికి డబ్బులందిస్తారు. ఈ రకంగా 'కై'లోకి అందించే 'కూలీ' డబ్బుల వల్ల కైకిలి ఏర్పడి వుంటుంది.

డేలీవేజెస్ అనే ఆంగ్లపదానికి అనువాదం ఏమిటి అని అడిగితే ఏం చెబుతాము? శిష్టభాషలో చెప్పాలంటే—రోజువారి జీతమంటామా? రోజువారి కూలీ అంటామా? ఎంత కృత్రిమంగా ఉంటుంది అలా అంటే. "కైకిలి" అంటే సరిపోదూ? ఒక భావాన్ని సమర్థంగా అందించే మాండలిక పదాలను నిఘంటువుల కెక్కించవలసిన అవసరం లేదూ? పత్రికా వ్యవహారంలో వీటిని ప్రయోగించవలసిన ఆగత్యం లేదూ? ఎందుకు లేదు. ఉంది. ఇంతలో చటుక్కున గుర్తుకొచ్చింది. ఏమిటది? ఈ పదాల నదిలో ఈదుతూ నేను "అంబటాల్ల"దాటినా 'టి' కూడా తీసుకోలేదని.

మా వూరు మాట్లాడింది-3

"ఆడపిల్లలు లేనివాడు - నా ఓయమ్మలారా -
యేడబన్నా తెల్లవారు - నా ఓయమ్మలారా"

పొలంలోనుంచి పాట వినిపిస్తున్నది. పాడుతున్నదెవరా అనిచూస్తే పసుల పోశమ్మ. పోశమ్మ మాటల్లో మాండలికాల మూటలు దొరికిన నాకు ఈసారి ఆమె పాటలో వర్తమాన సాంఘికస్థితిని వడబోసిన భావన దొరికింది. ఆడ పిల్లలను కన్నతండ్రి ఇబ్బందులు ఇందులో భంగ్యంతరంగా ధ్వనించినవి. ఆడపిల్లలను కననివాడు ఎక్కడ పడుకున్నా తెల్లారిపోతుందట. ఆడపిల్లలంటే పెళ్ళిళ్ల ఉరుములుకొస్తాయి. పెళ్ళిళ్లంటే బోలెడు కట్నాలు పళ్లు కొరుకుతాయి. ఈ ఉరుముల్లో - ఈ యెడాపెడా చరుపుల్లో ఆ కన్నతండ్రికి కన్నంటుకోదు. మరి మగరాయుళ్లను కన్నవాడు "రొమ్మున చేయిడి" నిద్రపోతాడు. కట్నాల సమస్యతో కటకటలాడే ఆడపిల్లల తండ్రుల అవస్థను ఆ జానపదహృదయం ఎంత ఆర్ద్రంగా ఆవిష్కరించిందో—

నన్నుచూడగానే పోశమ్మ పాట ఆపేసింది. "పాడవేం పోశమ్మా" అన్నాను. "సిన్నపాటలు యిన్న దొరలకు ఈ పాత పాటలేం రుచిస్తయి"— అంటూ సహజ వినయాన్ని ప్రకటించింది. పోశమ్మకేం దెలుసు ఈ పాత పాటలు - ఈ పల్లెపాటలు ఎంతెంత కవితాసంపదను పుక్కిట పెట్టుకున్నాయో; ఎందరెందరు పరిశోధకులకు ఇతివృత్తాలను అందించినవో; ఎన్నెన్ని సినీగీతాలకు పల్లవులై ప్రాణం పోసినవో. నేను పోశమ్మ పాడిన పాటను మధ్యలో విన్నా నని తెలుసుకుని "ఈ పాట మొదలేమిటి" అని పదే పదే అడగగా ఔననలేక కాదనలేక పోశమ్మ కాసేపు తటపటాయించి "మొదలు జదివితే మంచి గుండ దయ్యా" అన్నది అదేదో అశ్లీలం అనే సందేహంతో. "ఫరవాలేదు చదువు" అన్నాను. పల్లవించింది పాట—

"మాదిగోనీ మగులు మీదా
మంచి మల్లే పూసినాది.
కాపువారీ కైలీకోడె - నా ఓయమ్మలారా
వాసనకే మోసపోయె."

ఈ పల్లవిపాడి ఆగిపోయింది పోశమ్మ. ఈ పాటలోని పల్లీయ సాంఘిక వ్యవస్థ నా మనస్సును పట్టి ఊపేసింది. మాదిగ, మాల అనేమాటలు ఈనాడు 'హరిజన' శబ్దంలో కలుపుకున్నాము. వాటిని ఉచ్చరించవలసిన అవసరం ఇప్పుడు కలగడంలేదు. కలగకూడదు కూడా. కానీ ఒక చారిత్రక సత్యం వీటివెనక ఉంది. ఆ దృష్టితోనే ఈ పరిశీలన. మాదిగవాని గుడిసె. ఆ గుడిసె కొప్ప 'మగులు'. ఆ 'మగులు'మీద మంచి మల్లె పూసింది మంచి అనే మాటలో యతీ, మతీ రెండూ కుదురుకున్నాయి సమస్థితిలో. ఆ మల్లె ఒక అమాయకమైన పడుచు పిల్ల. మగులుమీద మల్లె ఉంది అంటే ఆ పాకలో ఒక పడుచుపిల్ల ఉందని. మల్లెలాంటి ఆ పడుచుపిల్ల అందం పరిమళించింది. 'కాపువారి కైలికోడె'కు ఆ వాసనకే మతితప్పింది. 'కైలికోడె'లో మదముంది. 'మంచి మల్లె'లో ముగ్ధత్వం ఉంది. ఆర్థికంగా సాంఘికంగా ఈ రెంటికి అంతరాలున్నాయి. కానీ కామం కళ్లల్లో చొరబారితే అంతరాలు లేవు; అవరోధాలు లేవు. ఈ శాశ్వత సత్యాన్ని అత్యంత ప్రతీకాత్మకంగా చిత్రించిన పాట ఇది.

ఈ పాటనుగూర్చి ఇలా నేను ప్రవహిస్తూ పోతూవుంటే పక్కచేనిలో కోడెగిత్తను తెగబాదుతున్న శబ్దం వినిపించింది. 'ఏమిటి పోశమ్మా! పాపం ఆ కోడెను చంపేస్తున్నారు' అన్నాను. 'పసిగోదను నాగలికి కడితే ఏంనడుస్తది? కైముదిరినంకనే కట్టాలె' - పోశమ్మ వాక్యంలో మళ్లీ మాండలిక భాషాయోష మందహాసం చేసింది. పాటనుంచి మాటకు నా మనసు పరవళ్లు తీసింది. 'గోద' అంటే గొడ్డు - పసిగోద అంటే ఇంకా ముదరని కోడెగిత్త. అది సరే. ఈ 'కైముదరడం' ఏమిటి. ముదరడం తెలుసు. కైముదరడం! ఆరు శతాబ్దాల వెనక్కి ఎగిరిపోయింది పదజిజ్ఞాస.

"ప్రాయమింతకు మిగుల కైవ్రాలకుండ
కాశికాఖండమను మహాగ్రంథమేను
తెనుగు చేసెద....."

శ్రీనాథుని వాణి వినిపించింది ప్రౌఢ సుందరంగా. అప్పటికే శ్రీనాథుడు చాలా చాలా కావ్యాలు వ్రాశాడు. కాదు. కొన్నిటిని ఊదేశాడు. నెత్తిమీద పిల్ల జుట్టున్న రోజుల్లోనే పురుత్తరాట్చరిత్ర వ్రాశాడు. మొలకమీసం మొలిచేనాటికే శాలివాహన సప్తశతి గుప్పించేశాడు, ఆ తర్వాత శృంగార నైషధం, భీమఖండం —అలా అలా పూర్తిచేశాడు. మరి వయస్సు మళ్లిపోతున్నది. ఇంచుమించుగా వాలిపోతున్నది. మరీ వాలకముండే-పండి ఒరిగి పట్టుతప్పక ముందే-కాశీఖండం రాస్తాను అన్నాడు. అందుకు అతడు వాడిన అచ్చతెనుగు నుడి-ఆనాటి పలుకుబడి—"కైవ్రాలు"ట. కైవ్రాలడమంటే బాగా వాలిపోవడం. పైరు పండి ఒరిగితే -అది కైవ్రాలినట్టు. శ్రీనాథుని కాలంలో-అంటే ఆరువందల ఏళ్లక్రితం వాడుకలో ఉన్న ఈ 'కై'—వ్రాలడంలోనే కాదు ; ముదరడంలోనూ వచ్చి కుదురుకున్నది. పసుల పోశమ్మ ప్రయోగించిన 'కైముదర'డం అనే పదానికి బాగా ముదరడం అనే అర్థాన్ని సమన్వయించుకునే సరికి కలిగిన ఆనందం నాదికాదు ఆ శ్రీనాథునిది.

"ఔను బాపూ! కైముదురంగనే కోడెను నాగలికి కట్టాలె. అబద్దం కాదు—నువ్వద్ది"—

"ఔనౌను పోశమ్మా! నీ మాట అబద్ధం అని నేనెందుకంటాను"—అన్నాను గానీ అదే-'నువ్వద్దే'-అనలేక పోయాను. ఎందుకంటే-'నువ్వద్దే' అనే పదం తొలిసారిగా విన్నవాళ్లకు 'నువ్వు వద్దే' అనే భావం స్ఫురించవచ్చు గదా! పోశమ్మ నన్ను వద్దని ఎలా అంటుంది. అందుకని ఆగిపోయాను 'నువ్వద్ది' వెనక ఏదో విపరీత శబ్దం సుఖంగా నిద్రిస్తున్నదని. ప్రయత్నం సాగింది ఆ పదాన్ని మేల్కొల్పడానికి. "నువ్వద్ది"—అంటే—అంతుపట్టలేదు. "అంతుపట్టలేదా" అంటూ ఆ ప్రక్కనే ఉన్న 'అబద్ధం' ముందుకొచ్చింది. ఒరె ఒరే! అబద్ధాన్ని బొత్తిగా మరచిపోయానే. అబద్ధాన్ని మరిస్తే నువు చాలా గొప్పవాడివోయ్!-ఓ అంతరాత్మా! శాంతించు కాసేపు. ఆర్థచర్చలో ఉన్నాను. "నువ్వద్ది--నువ్వద్ది-నువ్వద్ది"-ముమ్మారు నెమరువేసుకున్నాను. ఒక మెరుపు

మెరిసింది. "నిబద్ది" అని. నీవు—నువ్వుగా మారడం ఉంది. నిఖద్ది—నువ్వద్ది అయివుంటుంది. ఓకే. నిబద్ది-నిబద్ధం వికృతి ఎందుకు కాగూడదు? సరే-నిబద్ధం అంటే అబద్ధం కానిది. అబద్ధం కానిది నిబద్ధం-అంటే నిజం. నిబద్ధం నిబద్దిగా మారి, నిఖద్ది నివ్వద్దిగా మారి, నివ్వద్ది నువ్వద్దిగా మారిపోవడం-పదపరిణామక్రమానికు గిరి అంత సంతోషాన్ని గరిటలో నూరిపోయడం.

మా వూరు మాట్లాడింది-4

మా యిల్లు దాటి, ఆ యిల్లూ ఆ యిల్లూ దాటి నడుస్తున్నాను వీధిలో. ఆ మూలమలుపునుంచి - పూరిగుడిసెనుంచి ఒకపాట వినిపిస్తున్నది. అది కేవలం గ్రాంథంనుంచి ఉబికిన పాట కాదు. దానికో వాద్యం తోడుకూడావుంది. వాద్యమంటే ఏ వాయులీనమో, హార్మోనియమో, వీణో, వేణువో కాదు. ఏమిటా వాద్యం? అది గానానికే కాదు; మానానికీ తోడుగా ఉంటుంది. దాని పేరు రాట్నం. రాట్నం వడుకుతూ, ఆ ఝంకారమే తంబురా శ్రుతిగా తనకు తెలిసిన పాట పాడుతున్నది ఒక పండు ముత్తైవ.

"ఉసికాల ఆడేటి
కుసుమా సిరిబాలా
మా బాల వచ్చిందా
మిమ్మా కూడంగ"

ముంగిట్లో నిల్చుని వింటున్న నేను ముగ్ధుణ్ణయిపోయాను. తీగ సాగినట్టున్న ఆ రాగానికేకాదు; అమాయక హృదయంనుంచి పొంగి వచ్చిన ఆ ఆత్మీయతకు; ఆ నిసర్గ రసవద్గీతకు. ఒక తల్లి ఒక పాప నడుగుతున్నది తన పాపనుగూర్చి. ఆ పాప యెవరు? "ఉసికాల ఆడేటి కుసుమాసిరిబాల". ఇసుక ఉసికగా మిసిమి పెంచుకుంది. మరి 'కుసుమా సిరిబాలా!' ఇది వ్యాకరణం దృష్టిలో వైరిసమాసం. కానీ ఎంత వింత పదమైత్రి. అటు కుసుమం - ఇటు బాల. మధ్యలో సిరి. "కుసుమా సిరి బాల"-కుసుమంలా సిరులొలికే బాల - రెండు తత్సమాల నడుమ ఇమిడిపోయిన ఆ దేశిసిరి ఏమంటుంది? అమాయకులైన జానపదులు ప్రయోగించే అరిసమాసాలైనా కలకండ పలుకుల్లా రుచులొలుకు తాయని, అసమర్థులైన కవులు పనికట్టుకుని సృష్టించే మిశ్రమ సమాసాలు పెరుగూ వడ్లూ పిసికినట్లు రసాభాసపాలౌతాయనీ.

ఇలా ఇలా అనుకుంటూ పోతూవుంటే ఎదురయింది పసుల పోశమ్మ. ఎదురయ్యింది కాదు; నేనే అలా అలా నడుస్తూ ఆ పోశమ్మ గుడిసెను చేరు

కున్నాను. ఎడాపెడా చెంపలు వాయిస్తున్నది పోశమ్మ ఒక పదేళ్ల కుర్రవాణ్ణి. "ఏమిటి పోశమ్మా ఎవరతను? ఎందుకు కొడుతున్నావు పాపం" - 'మైసడు బాపూ. నా మన్మడు. ఎండుగు లారబోసిన. గైండ్ల గూసోరా అంటే ఊరు దిరుగబోయిండు".

"ఏమిటేమిటి? నీ మనవడా? మద్దొస్తున్నాడు. మైసడు కాదు మైసయ్య అనాలి. కొట్టకు పాపం. ఇంతకూ అతడు చేసిన తప్పేమిటి?" - అంటూనే ఉన్నాను. "గైండ్ల గూసోరా అంటే ఊరు దిరుగబోయిండు" అన్న పోశమ్మ పలుకు గీపెట్టింది మనసులో. "గైండ్ల". చిననాటి స్మృతులు - స్మృతులే కాదు - శబ్దశ్రుతులు - బిలబిలా మూగుతున్నాయి. "గైండ్ల" ఇది నాకు కొత్త పలుకు కాదు. చిన్ననాటినుంచి నాతో చెలిమి చేసుకున్న పలుకే. బాల్యదశా కుల్తో కలిసి పయనించిన ప్రాబలుకే. గైండ్ల అంటే వాకిలి. ఎలా? ఎలా? నిఘంటువు ఘోషిస్తున్నది గవను అంటే దుర్గపురద్వారమని. ఏ పురద్వారమైనా తలుపేకదా - తొలి తలుపుండేదెక్కడ వాకిట్లోనేకదా! అంతపరకెందుకు? అభినవకవి జాషువా పలుకు రెక్కలు విప్పుతున్నది 'శ్మశానం'లో. "కవుల కలాలు గాయకుల కమ్మని కంఠము లీ శ్మశానపుంగవనుల" - చాలు - శ్మశాన పుంగవనుల అంటే వల్లకాటి ముంగిళ్లన్న మాట.

నా "అంతశ్చేతన"లో 'గవను' తిరుగుతూనే వున్నది. పోశమ్మ మన మణ్ణి గూర్చిన చిరాకు పడ్డిస్తూనే ఉన్నది - తనమాట ననేమీ వినడని; ఉన్న చోట ఉండడని; ఆవూళ్లో వాడెక్కని చెట్టులేదని; దూరని పుట్టలేదని. నన్ను నేనే వీపు తట్టుకుని అన్నాను 'ఏమిటి పోశమ్మా ఏమంటున్నావు' అని. "మన్మని సంగతే బాపూ! సెప్పి సెప్పి యాష్టకొచ్చె". మరో మాండలికం మణిపూసలా రాలింది పోశమ్మ నోటినుంచి. 'యాష్ట'-'అలిష్ట' లాగే వుందిది. అలసభావం అలసత. అలసతే తద్భవించి అలసటగా రూపొందింది. అంతటితో ఆగిపోదే వ్యవహారం. అలసట గమ్మత్తుగా అలిష్టగా మారింది. అలసటే వికృతి. దానికి మరింత వికృతి అలిష్ట. కానీ ఇది ప్రకృతికంటే తాతగా ధ్వనిస్తున్నది. అభీష్ట, ధనిష్ఠల్లా. 'యాష్ట'కూడా ఈ గోత్రానికి చెందిన మాటే. 'యాష్ట' అంటే విసుగు. మనమణ్ని ఆరికట్టలేక పోశమ్మకు విసుగొచ్చింది. అది సరే ఈ 'యాష్ట' ఏ విత్తులోంచి వచ్చింది. 'వేసట' నుంచి. వేసట చాలా

పాతమాట. భావకవిత్వంలోకికూడా ఆ మధ్య చొరబారింది - "వేసటేలేని వెర్రి అన్వేషణమ్మ" అని కృష్ణశాస్త్రిగారు వినిపించింది ఈ వేసటే. వేసట యేసటగా, యేసట యాసటగా, యాసట యాస్టగా - కొండొకచో యాష్టగా రంగులు మార్చుకుండి. వేసట ఒక దేశినుడి. ఆ దేశినుడికి ఇన్ని వికృతులు. చివరిమాట 'యాష్ట'. ఇది సంస్కృతములోని 'ఇష్ట' శబ్దానికి పిన్నమ్మ కూతురులా రూపొందడంలో ఉన్నది చమత్కారమంతా. పోశమ్మ ఊరుకో లేదు. మాట్లాడతూనే వుంది. "యీడు సెప్పిన మాట యినడుగాని బంగరిద్దో డయ్యో! పాట పాడితె పానమే లేస్తడి". ఒకేసారి నా బుర్ర మాటమీదికి, పాటమీదికి పరుగులు తీసింది. 'బంగరిద్దోడు'. వెనక ఎప్పుడో 'కైత్కాలోడు' మాట విని దాని వెనక కవిత్వాలవాణ్ని కనిపెట్టిన నా బుద్ధి ఈ సారి "బంగ రిద్దోడు" మాటున దాగున్న చోద్యంవైపు ఉరకలు వేసింది. బంగరు+ఇద్దె+ వాడు అన్యోన్యంగా కలుసుకుంటే 'బంగరిద్దోడు' పుట్టుకొచ్చాడు. బంగారు విద్యవాడు. అంటే స్వర్ణకార విద్య ఎరిగినవాడన్నమాట. పరుసవేది మనకు కొత్తకాదు. 'పరుసవేది సోకటయును, పరుషలోహ మధిక శుద్ధ సువర్ణమయైన పోల్కి'— అని ఉత్తర హరివంశం ఉద్ఘోషిస్తున్నది. ఇనుమును బంగారంగా మార్చే విద్య స్వర్ణకార విద్య. అది సామాన్యవిద్య కాదు. వాసి మామూలు తెలివికాదు. అసాధారణ ధిషణకు ప్రతీకంగా జానపదులు వాడుకునే పదం 'బంగరిద్దోడు'. పోశమ్మ మనమడి తెలివికూడా అలాంటిదే అన్నమాట. అంటే ఆది ఇనుమును బంగారం చేసే తెలివికాదు. పదం పలికితే ప్రాణాలను ఝుమ్మనిపించే తెలివి. పాట గుర్తుకొచ్చి మాటను పక్కకునెట్టి ప్రశ్నించాను "ఏదీ మైసయ్యా: ఒక పాట" అని. సిగ్గుతో అష్టవంకరలు తిరిగిపోయాడు ఆ సిసింద్రీ చిట్టిబాబు. పోశమ్మ గదమాయించింది మనమణ్ని " అగో పాడు. మొత్తం యాదికి లేకపోతే నాలుగు నుడుగులన్న సదువు". పాట వినాలనే కుతూహలంతో ఉన్న నాకు మళ్లీ ఆ పానకం అందకముందే మాటల పుడకలు దొరుకుతున్నాయి. "యాది" "యాద్" అనే ఉర్దూమాటకి తెనిగింపు. మరి "నుడుగు". నుడి అంటే మాట. ఇది అచ్చ తెలుగుబడి. తెలుగు బడి అంటే తెలుగు స్కూలు అని కాదు. తెలుగు పలుకబడి. ఇదేమిటి అని మీరు విస్తు పోనక్కరలేదు. తిక్కన్ననడిగితే చెబుతాడు. నమ్మకపోతే తన నిర్వచనోత్తర రామాయణం దాఖలా చూపిస్తాడు. ఇంతకూ "నుడుగు" అంటే పలుకు పదం

అన్నమాట. పరమ ప్రాచీన గ్రాంధిక రూపమిది. "నుడుగురేడు" అంటే బృహస్పతి. దీనికీ దాఖలా కావాలా? అయితే తొలి అచ్చతెనుగు కావ్యం యయాతి చరిత్ర నడగండి. సోరారా పాడుతుండి. "ఆరయ వేల్పులకెల్ల నయగార నందగు నుడుగు రేనికి కూర్మి కొడుకు కట్టి" అని. ఇంతటి ప్రాచీన దేశ్యపదం ఇప్పటికీ పల్లెతల్లి నాలుకపైన పదిలంగా ఉన్నందుకు పరవశింత కలిగింది. "నాలుగు నుడుగులన్న సదువు" అన్న పోశమ్మ హృదయం నాలుగు మాటలైనా లేక నాలుగు పంక్తులైనా చదువుమని ప్రబోధించింది. ఈ నుడుగు కడలిలో నేను మున్కలేస్తూ వుండగా "అగో అగో ... యాడికి యాడికి..." అని పోశమ్మ ఉచ్చైస్వరం వినిపించింది. "ఏడి మైసయ్య"? తుర్రుమన్నాడు- దూరాన చింతచెట్టెక్కి చిటారు కొమ్మల్లో కూచుని పాడుతున్నాడు.

"పచ్చిమానూ తొర్రలోనే
పంచరంగుల పచ్చిపలికె
పచ్చిపలికె - పచ్చిపలికె
పచ్చీపలికె - పచ్చీపలికె."

ఎంతకూ "పచ్చిపలికె" అనే ఆ రెండు నుడుగులనే తిప్పితిప్పి పాడుతున్నాడు. రకరకాల లయల్లో, గతుల్లో దరువులు విసురుతున్నాడు. కేరింతలు కొడుతున్నాడు. దరువుకీ దరువుకీ మధ్య నోటితో మద్దెల వాయిస్తున్నాడు.

మా వూరు మాట్లాడింది-5

"పంచరంగుల పచ్చిపలికె
పచ్చీపలికె పచ్చీపలికె."

అదే దరువు వినిపిస్తున్నది. అదే స్వరం మధురిస్తున్నది. ఎప్పుడో పొందిన అనుభూతి అలలు అలలుగా పులకిస్తున్నది. అయితే—చుట్టూ చూస్తే—చింతచెట్టు లేదు. చేనుంది. మొక్కజొన్నచేను. ఆ చేని బొడ్డులో మంచె వుంది. మంచెమీద ఉన్నాడు మైసయ్య. చెట్టుమీద పాడిన పదమే చేనిలో వినిపిస్తున్నది. ఈసారి నేను పాటపాడమని అడగాలనుకోలేదు. అడగలేదు కూడా. కారణం? మైసయ్య నన్ను చూడలేదు. పరవశించి తానే పాడుకుంటున్నాడు. మొక్కజొన్న మొక్కలు పాటకు తలలూపుతున్నాయి. వాటిమీద ఆడాటున వాలే పిట్టల్ని వడిసెల గుండ్లతో తోలుతూ మైసయ్య పాడుతూనే వున్నాడు. అప్పుడు దొరికింది నా అన్వేషణఫలం.

"పచ్చిమానూ తొర్రలోనే
పంచరంగుల పచ్చి పలికె
పచ్చిపలికిన పలుకూలకూ
పగడమే పదివక్కలాయె.

పంచరంగుల పచ్చి అంటే పంచవన్నెల చిలక. పక్షి శబ్దం మెత్తగా ఒదిగిపోతే పచ్చి. ఇంచుమించు ఉన్న చమత్కారం 'పచ్చిమానూ తొర్రలో' పచ్చి పలకడం. పచ్చి రెండుసార్లొచ్చింది. ఒకటి పసిమివల్ల, పచ్చదనంవల్ల ఏర్పడిన పచ్చి. మరొకటి 'పక్షి'కి వికృతి పచ్చి; లక్ష్మికి తద్భవం 'లచ్చి'లాగా: ఆ చిలక పలికిన పలుకులతో ఏం జరిగింది; విన్నవాని హృదయం మురిసింది. అంతేనా? అయితే నేననాల్సివస్తుంది జానపదకవితాహృదయం లోతు ఇంతేనా అని! కలికి నవ్వితే ముత్యాలు రాలుతాయి. చిలక పలికితే పగడాలు రాలుతాయి. ఇదీ ఒక సొగసే. కానీ అంతటితోనే జానపద కవితాత్మ ఇంకిపోలేదు. ఆ చిలక పలుకులు పగడాల్లా ఉన్నాయనలేదు. పగడాలను మించి ఉన్నాయి.

అంతేకాదు. ఆ పలుకులు వెలువడేసరికి పగడాలు పదివక్కలైపోయినవట. "పలుకుకు విలువెంత? పగడం తలను పదివక్కలు చేసేంత." ఎంతటి అలంకారముంది ఈ భావనలో. ఉపమను మించిన—కాదు మించిన 'వ్యతిరేకాలంకారం' పొడిపొడిగా నవ్వుతున్నది. ఇంతటి భావుకత ఉన్నందువల్లనే పల్లెపాటలు వెయ్యేళ్లుగా బతికి బట్టకట్టి మానంగా, మౌనంగా ఎదుగుతున్నాయి.

'మైసా — ఓరి మైసా' — విన్నగొంతే. ఎవరిదని అడగడమెందుకు? పసుల పోశమ్మదే.

'రా బిడ్డా రా! యేరే బియ్యం బెట్టిన. బాగుడికింది. తిందువుగని రా.' తీయని ఓదార్పు. ఆప్తత ఆంచుల్లో విరగబూస్తున్న ఊర్పు.

పోశమ్మ బతిమిలాట వెక్కడాగిన ఉదంతం తేటపడింది. తానేదో పనిలో మునిగిపోయింది. పొయ్యిమీద ఉడికేసిన బియ్యం మంట సరిగాలేక 'నానువాలు వడ్డది' — ఇదే పోశమ్మ ఫిర్యాదు. 'నానువాలంటే' కొంత ఉడకని బియ్యం. నాను+పాలు. సంధికార్యం సరళసరళంగా పలకరించింది. ప్రాలు—వాలుగా మారిపోయింది. తలంబ్రాలులాంటిదే ఇది. తల+ప్రాలు=తలంబ్రాలు. తలమీద కుమ్మరించే బియ్యం. అంటే అక్షతలని వివరణ అవసరమా. ఈ తలంబ్రాలే మరింత సరళంగా ఆకృతి తీర్చుకుని "తల్వాలు"గా వాడుకలో ఉన్నాయి. తలంబ్రాలుకు తెలంగాణా మాండలికం తల్వాలు. నానువాలు ఈ శ్రేణికి చెందిన పదమే. నానిన బియ్యం అన్నమాట. అంటే ఉడికిన బియ్యం కాదన్నమాట. ఎవరైనా బితుకు బితుకు మంటుంటే, నానువాలు పడిపోతున్నాడనే వాడుకకూడా లేకపోలేదు. ఈ నానువాలే సర్కారుజిల్లాల్లో "అన్నం నానువాయి అయ్యింది" అనే ప్రయోగంలో ఉన్నట్టు తెలుస్తున్నది.

పోశమ్మ బతిమిలాటతో మెత్తబడిపోయాడు మైసయ్య. చెకచెకా మంచె దిగి చెంగున పరుగుతీశాడు. మొక్కజొన్న పైరులమధ్య ఆగి కిలుక్కున నవ్వి "బాపూ! ఇంకోపాట వింటవా" అన్నాడు. నేను కనురెప్పలార్చి "ఔను మైసయ్యా" అనకముందే అందుకున్నాడు. ఈ సారి మరికొంత జోరుగా; చేనూ చెలకా ప్రతిధ్వనించేంత హోరుగా.

"పటేండ్ల జీతగాడు
పయ్యేడ్ల మేపెటోడు
బండెక్కి సీటిగొట్టెనే
ఓ బొల్లారపెల్లా."

ఆ తర్వాత ఏమి పాడుతున్నాడో నాకు వినిపించలేదు; పైరగాలి అలలమీద నోరారా ప్రతిధ్వనిస్తున్న "ఓ బొల్లారపెల్లా" "ఓ బొల్లారపెల్లా" తప్ప. ముందటి పంక్తులను చెవుల్లోనుంచి మనసులోకి చేదుకున్నాను.

"పటేండ్ల జీతగాడు
పయ్యేడ్ల మేపెటోడు"

ఇటు ఆక్షరసామ్యం ఉన్న యతినియతి. అటు అంత్యప్రాసం చేస్తున్న సుందర హాసం. "పటేలు" అంటే సర్కారుజిల్లాల్లో మునసబులాంటివాడు. అంటే స్థూలంగా భూకామందు. మునసబే కానక్కరలేదు. పటేండ్ల జీతగాడంటే పాలేరని తెలిసింది. మరి 'పయ్యేడ్ల' మాట. పైతయెడ్లా అనుకున్నాను. పైయెడ్లు, కిందియెడ్లు — ఈ ఉచ్చనీచాలు ఎద్దులకుకూడా ఎందుకనిపించింది. "పైయెడ్లు" అన్న మాటవెనుక విలక్షణమైన ఆర్థమేదో ఇమిడి ఉన్నట్టు అనిపించింది. "పయ్య" అనేపదం వర్ణపరంగా ఉన్నట్టు స్ఫురించింది. స్ఫురించడమేమిటి? బాల్యంలో విన్న రెండురకాల వన్నెల యెద్దులు కళ్లముందు ఉరుకుతున్నాయి. 'పయ్యేద్దును మలుపు' 'అదుగో ఆ పుల్లెద్దును మర్లెయి'. పయ్యేద్దు కొంత ఎరుపువన్నెది. పుల్లెద్దు తెల్లనిది. పయ్యవన్నె అంటే పల్లవన్నె. కపిల వర్ణం. ఎరుపువన్నె. పయ్యేద్దు అంటే ఎరుపువన్నె యెద్దని రుజువయ్యింది.

'పయ్యేడ్ల మేపెటోడు'—ఆ పటేండ్ల జీతగాడు. ఏం? పుల్లెడ్లను మేపేవాడు ఎందుకు కాగూడదు? కావాలంటే పలికేదీ, వద్దుపొమ్మని ఆంక్షలు విధిస్తే నోరు మూసుకునేదీ కాదు జానపదకవిత. అది ఆవేశంలోనుంచి పుడుతుంది. నగ్నంగా, పరమోద్విగ్నంగా గజ్జెకడుతుంది. తన లయతో నేలనూ గాలినీ చుట్టబెడుతుంది. నిసర్గభావుకుల మనసుతలుపు తడుతుంది. అంతే.

'పటేండ్ల జీతగాడు' అన్నాడు ఆ జానపదుడు. వెంటనే యతి తరుముకొచ్చింది. క్షణంలో జరిగిన చమత్కారమిది. వెంటనే ఎత్తుకుంటాడు "పయ్యేడ్ల

మేపేటోడు" అని. కానీ ఆ యతి నియతి అందాన్ని మింగేయదు; అర్థాన్ని అడుగంటనీయదు.

ఇంతకూ అసలు విషయం అక్కడేవుంది; మంచెమీద మైసయ్య మరిచి పోయిన గొంగడిలాగా. ఆ జీతగాడు ఏం జేశాడు? 'బండెక్కి సీటి గొట్టి' నాడు. సీటి అంటే ఈల — Whistle. ఈల వేయడం ఉత్సాహానికి విషయ సూచిక. హుషారుకు మొదటి శీర్షిక. ఆ జీతగాడు కామంచుగారి జీతగాడు. అందుకే బండెక్కి ఈలవేశాడు. ఎవరిని చూసో? శ్రీనాథుడే బ్రాహ్మడను కుంటున్న క్రీడాభిరామం కళ్లముందు కేళ్లురుకుతున్నది. ఒక ర్తి పలనాటి వీర చరితం ద్విపద ప్రబంధంగా పాడుతున్నదట ఓరుగల్లు పురవీధిలో. అది మామూలు పాట కాదు. మోతగా ఉన్న తాళగతిలో గుమ్మెటమీద 'ధుం ధుం కిట' అంటూ వాయిస్తూ. నడివీధిలో ఆ వీరచరితం పాడుతూవుంటే మతిపోయిన నాటి కుర్రకారు 'ఫీట్కారం' చేస్తూ తూలిపోయిందట. అంటే ఈలవేస్తూ పరవశించారు ఆనాటి పడుచువారు. ఆ ఫీట్కారమే ఈల. అదే మాండలిక పరివేషంలో 'సీటి'. మొత్తానికి నాలో ఒక సీటి కొట్టి, ఒక ఈలవేసి, ఒక ఫీట్కారం చేసి మాయమైనాడు మైసయ్య. మళ్లీ కనబడడా? చూస్తాను చెవులు పిండి అతని చేతికిస్తాను. చవులొలికే జానపద గీతికాకణికలు మరిన్ని బదువరుల చేతికిస్తాను.

మా వూరు మాట్లాడింది-6

సన్నసన్నగా ముసురు. చెప్పులు కొంచెం కొంచెం దిగబడుతున్నాయి. నెమ్మది నెమ్మదిగా నడుస్తున్నాను. చాలారోజులయింది పసుల పోశమ్మ కనిపించి. చినుకుల్లా ఆలోచనలు. "అయ్యో బాపూ! పిల్లతొవ్వ బట్టినవు. జారి పడేవు" — పసుల పోశమ్మ చల్లని కంఠస్వరం. పచ్చని పైరులాంటి ఆప్యాయత. ఆ పలకరింపు మళ్లీ నా చెవిలో మారుమ్రోగింది. 'పిల్లతొవ్వ' ఎంతెంతో మెత్తగా ఎద అంచులు మీటింది. పిల్లగాలి ఉంది. పిల్లవాగు ఉంది. మరి ఈ 'పిల్లతొవ్వ'— పిల్లత్రోవ. అంటే కాలిదారి. కాలినడకతో పోయేది పిల్లతొవ్వ. బండ్లు సాగేది 'బండ్లబాట'. చిన్న, లేత అనే అర్థాల్లో ఉన్న 'పిల్ల' అనే పదం తొవతో కలుపుకున్న పొత్తు ఎంతో కొత్తగా భాసించింది.

పోశమ్మా నేనూ ఆలా నడుస్తూనే ఉన్నాము. "తుర్‌తుర్‌తుర్" అంటూ ఒక అమ్మాయి ధ్వన్యనుకరణ చేస్తూ దూసుకుపోయింది మా యెదటినుంచి. అలాగే తేరిపారచూస్తున్నాను ఆ అమ్మాయిపైపు. పోశమ్మ నా విస్మయాన్ని గమనించి అన్నది 'ఏందిబాపూ బీరిపోతున్నవు. అదో బిత్తిరిది.' బీరిపోతున్నవు, బిత్తిరిది—ఒక్కమాటుగా రెండుమాటలు రెక్కలెత్తినవి. నేను విస్తుపోయి చూస్తున్నాను. అదే బీరిపోతూ చూడడమన్నమాట. 'బీరిపోవు' గురించి ఆలోచిస్తూంటే భారతంలోని విరాటపర్వం గుర్తుకొచ్చింది. తిక్కన్న ప్రయోగం స్మృతికి తగిలింది. "పొడచిన వెస బీఱువోవక యొండొరు నందందు పొడుచుచు". ఇక్కడ బీఱువోవక, అంటే బలహీనం కాక అని. ప్రాచీన కావ్యాల్లో ఈ 'బీఱువోవు' అనే పదం వ్యర్థం కావడం, బలహీనం కావడం అనే అర్థంలోనే వుంది. ఇంతకూ బలహీనం కావడం అనే గుణం నివ్వెరలోనూ జరుగుతుంది. ఆశ్చర్యంలో నీరుగారిపోయే లక్షణం లేదామరి: ఆ 'బీఱుపోవు' మాటే ఈ 'బీరిపోవు'గా మారింది. అర్థవ్యక్తిలో చిన్నమార్పును తెచ్చిపెట్టుకుంది. 'బీరిపోవు'లో నుంచి 'బిత్తిరిది' ఎదురొచ్చింది. ఆ అమ్మాయి వాలకం చూస్తుంటే స్తిమితం లేని వ్యక్తిలా వుంది. అరపిచ్చో, పావుపిచ్చో ఉన్నట్టూ అనిపించింది. 'బిత్తిరిది' ఆవిడ. బిత్తరం అంటే చంచలం అని ప్రాచీనకావ్యాల

సౌఖ్యాలు బోలెడు. ఆంధ్ర కవితాపితామహులే అన్నారు కదా మనుచరిత్రలో 'అనిమేషత్వము మాన్పె బిత్తరపుచూపు' అని. బిత్తరపుచూపు. చంచలమైన చూపు. బిత్తరం ఉన్నది బిత్తరిది. అంతే. అదే 'బిత్తిరిది'. అంటే మనస్ చాంచల్యమున్నది మరోరకంగా చెబితే పిచ్చిది. ఇది స్త్రీపరంగానే కాదు. పురుషపుంగవునికి కూడా వర్తిస్తుంది 'బిత్తిరోడు' అని. అప్పుడప్పుడు ఇది ఆక్రమేడిత మవుతుంది. "ఎహే : బిత్తిరి బిత్తిరి జేస్తవు'. 'బిత్తిరిది' కాస్తా అచ్చుతప్పుకు లోనై 'బిత్తళిది' అయితే వ్యవహారం బెడిసిపోతుంది. 'బిత్తళి' అంటే దిసమొలది.

మనసులో ఈ మాటలవేళ్లు తవ్వుతూనే పోశమ్మను 'ఏమిటీ ఊరి సంగతులు' అని అడిగాను. ఏవేవో సమాచారాలు ఏకరువు పెడుతున్నది. మంచీ చెడూ, న్యాయంఅన్యాయం ఆమెమాటల్లో వెలుగునీడల్లా స్ఫురిస్తున్నాయి. చెబుతూ చెబుతూ అనేసింది "వాడు ఈ ఊరికి మొక్కలమైపోయిండయ్యా" అని. మొక్కలం అనే మాటలో 'మొక్క'ను విడదీసి చూస్తే రావలసిన అర్థం రాదు. అంతేకాదు. పోశమ్మ చెప్పింది ఒక దుర్మార్గుణ్ణిగురించి. మొక్కలమై పోయిండు అంటే కంటకమైపోయాడనో, బల్లెం అయిపోయాడనో అర్థం రావాలి. రాకేం చేస్తుంది. మొక్కలం అనే పదానికి 'ముష్కరత్వం' అనే అర్థముంది. అసలు ముష్కరం వికృతే మొక్కలం. తమాషాగా మారింది రంగు. శ్రీనాథుడు కాశీఖండంలో అన్న 'శక్రని మొక్కలంబుల్ వినంబడ్డవే కావె' అనే దండక భాగం ముష్కరత్వాన్నే బలపరిచింది. ఆ దుర్మార్గుడు ఊరికి 'మొక్కలమై' పోయినాడంటే ముష్కరుడైనాడన్న మాట. ఆ మాట అలాఅలా తిరుగుతూ ఉండగా 'బాపూ' అని దూరంనుంచి పిలుపు. అరే....అరే....ఆదుగో— మైసయ్య. 'మైసయ్యకు నన్ను ఎలుగెత్తిపిలిచే చనువేర్పడింది. బాగుంది. కానీ వానచినుకులాంటివాడు. చేతికందడే. "మైసయ్యా : ఉండు. ఉండు. నీతో పని ఉంది". లాభంలేదని నేనూ పరుగుతీశాను. పట్టేశాను. కిలకిల నవ్వుతూ అన్నాడు 'బాపూ ! అబద్ధమాడుతున్నవ్ ! నాతో నీకు పనికాదు; పాట కావాలె'. ఎంతబాగా చదివాడు నా అంతరంగాన్ని. 'ఔను మైసయ్యా ! ఈసారి ఒక కొత్తపాట పాడు. నాలుగు నుడుగులు చదివి తుర్రుమనొద్దు. ఏదీ పాడు'. నేను బతిమిలాడడం భావ్యం కాదని అనుకున్న పోశమ్మ 'వారీ !' అంటూ ఉరిమే పరికి మైసయ్య అందుకున్నాడు.

"కాళ్లిరగ్గొట్టిండు నాదేవుడు—కాళ్లి
కడియాలు దెచ్చిండు నాదేవుడు.
నడుమిరగ్గొట్టిండు నాదేవుడు—నడుము
ఒడ్డాలం దెచ్చిండు నాదేవుడు.
మెడలిరగ్గొట్టిండు నాదేవుడు—మెడల
కంటెనే వెట్టిండు నాదేవుడు."

ఈ రకంగా పాడుతూ పోతున్నాడు. ఎవడీ దేవుడు? ఎందుకలా చేస్తున్నాడు? కాళ్లు విరగ్గొట్టడమెందుకు? కడియాలు తేవడమెందుకు? ఎందుకింత క్రూరత్వం? ఏమిటీ కసి? సమాధానం పాట చివరిపంక్తుల్లో దొరికింది.

"బాయాల కప్పోలె వాడున్నడూ
బంగారు బొమ్మోలె నేనున్నా.
చేతూల కట్టోలె వాడున్నడూ
సెనిక్కాయ పువ్వోలె నేనున్నా".

చాలు చాలు. తెలిసింది విషయం. ఆ దేవుడు భర్త. ఆవిడ భార్య. ఆమె వన్నెలో బంగారుబొమ్మ. పరువంలో విరబూసిన సెనగపువ్వు. అతడు బావిలోని కప్ప. కూపస్థమండూకం. అజ్ఞాని. మూర్ఖుడు. చేతిలో కట్టెపంటివాడు. కసితప్ప గసికత ఎరుగనివాడు. ఆమె అందాన్నిచూస్తే అతనికి అసూయ. ఏదో నెపంతో చావబాదేవాడు. ఏ పెళ్లికో పెళ్లాలన్నప్పుడు మాత్రం ఎంతో ఆప్యాయత ఉన్నట్టు కడియాలూ, కంటె, ముక్కపుల్లలూ, వొడ్డాణం తెచ్చి పెట్టుకో అనేవాడు. జోడుకుదిరిన ఈ పడుచుజంటలో ఆ పసిడిబొమ్మ పడుతున్న పాట్లనూ, నిర్వేదాన్నీ ఎంత హృదయద్రావకంగా వర్ణించిందీ జానపద గీతిక. 'కూపస్థ మండూక' అనే సంస్కృతన్యాయాన్ని అచ్చతెలుగులో అందరికీ అందుబాటులో ఉండేట్టు 'బాయాల కప్పోలె' అనడం తెలుగునుడికి ప్రాణం పోయడం. 'సెనిక్కాయ పువ్వోలె' అనే ఉపమకూడా సరికొత్తదే. ఆ పల్లె పడుచుకు తనకు సన్నిహితంగా ఉన్నపూలే గుర్తొస్తాయి. పారిజాతాలూ, మందారాలూ స్ఫురించవుగదా. సెనగపువ్వు కళ్లముందు తలనూపింది. అంతే. అది ఈ పాటలో విరబూసింది.

ఇంత చక్కని పాటపాడిన మైసయ్యను మెచ్చుకోవాలనీ, పాడమని గద్దించిన పోశమ్మకు కృతజ్ఞత లిచ్చుకోవాలనీ చూస్తే — ఏరీ? ఆ యిద్దరూ లేరే? మెచ్చుకోలుకోసం పాడినపాట కాదుగదా అది. పైరగాలిలాంటిది. స్వచ్ఛంగా, స్వచ్ఛందంగా వీస్తుంది. పయనం తనది. ఫలితం మనది.

సి. పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయము
ప్రవేశ సంఖ్య .....
తేది .....
కడప - 516 004.

మా వూరు మా ట్లూడింది

—మతి నుడుగు

దొర కొడుకు

పల్లవి ॥ ఎంతపనిజేసె దొరకొడుకు । అతని పే
రెత్తితే కడుపంత ఉడుకు । ॥ఎంత॥

చరణం-1 : కానేండ్లు పట్నంల
సదువుకుంటుండు ।
యేసంగి సెలవులని
ఇంటి కొచ్చిండు ।
సన్నవాగూ కాడ
నన్ను జూసిండు ।
సూపుతోనే నన్ను
ఊపివేసిండు । ॥ఎంత॥

చరణం-2 : నే నడిసి పోతుంటె
తా నడిసి వచ్చిండు ।
నే నేడ నిలుసుంటె
తా నాడ నిలిసిండు ।
ఏమి తోసక నేను
"ఏందయ్యా" అంటేను
పోటో తీస్తానని
మాట తిప్పేసిండు । ॥ఎంత॥

చరణం-3 : గడ్డి కోసేటపుడు
కండ్లు మూసిండు ।
కుప్ప మోసేటపుడు
కొంగు బట్టిండు ।

ఉలికిపడి నేనపుడు
ఉరిమిసూనే సరికి
"సినిమాలొ ఇట్లనే
సే స్తరని నవ్విండు। ॥ఎంత॥

చరణం-4 : ఒరుసుకొని ఒరుసుకొని
తిరుగజొచ్చిండు।
సిగ్గుపడుతుంటె నా
సెంప నిమిరిండు।
సిలకనని ముత్యాల
గొలకనని ఏవేవొ
క్కైత్కాలు సూపించి
కరుగదీసిండు। ॥ఎంత॥

చరణం-5 : 'లచ్చిని దొరా' అంటె
లచ్చిమీ అన్నాడు।
"లచ్చిమీ మా యింటి
లక్ష్మివే" అన్నాడు।
లగ్గమాడే రోజు
దగ్గెరుందన్నాడు।
ఎన్నొ బాసలు జేసి
ఇగరాడు అగరాడు। ॥ఎంత॥

తెలంగాణా పల్లెల్లో ఊరి పెత్తందారును 'దొర' అంటారు. అతను పటేల్ (మునసబు) కావచ్చు. పట్వారీ (కరణం) కావచ్చు. లేక మోతుబరి ఆసామీ కావచ్చు. 'దొర' అని పిలుస్తుంటారు. కోస్తాప్రాంతాల్లో 'దొర' అనే మాట తెల్లదొర (పాశ్చాత్యుల) లను స్ఫురింపజేస్తుంది. "ఏంటి దొరలా వస్తున్నావు?" అన్నప్పుడు ఉన్న దొర తెల్లదొరే. క్రమంగా ఆ ప్రాంతాల్లోకూడా 'దొరతనం', 'దొరబాబు' అనే మాటలు దేశీయతను సంతరించుకున్నాయి.

ఈ పాటలోని దొరకొడుకు సిటీకో పెద్దచదువులు చదువుకుంటున్నాడు. ఇలా చదువుకునేవాళ్లు సెలవుల్లో ఊరికొస్తుంటారు. ఓ కెమెరా పట్టుకుని సరదాగా ఫోటోలు తీసుకుంటూ తిరుగుతుంటారు. అలాంటప్పుడు తారసిల్లిన కన్నెపడుచే లచ్చి. దొరబిడ్డకు కన్నుచెదిరింది. లచ్చి ఎక్కడుంటే అక్కడికి వెళ్లడం, దారికెదురుగా నిలవడం, 'ఫోటో తీస్తా'నని బులిపించడం, అలాఅలా ఆ అమాయకపుపిల్లను కరగదీయడం, చివరికి పెళ్లిచేసుకుంటానని బాసచేసి, ఆ పిల్లను వల్లోవేసి, దగాచేసి ఆ పల్లెముఖం చూడకుండా తప్పించుకోవడం జరిగింది.

ఎంతకూ తిరిగిరాని దొరకొడకును తలచుకుని కడుపుదికిపోతుండగా ఆ పల్లెపడుచు వెలిజిమ్మిన ఆర్తిగీతం ఇది.

ఇక ఈ పాటలోని కొన్ని మాటలను గురించి ముచ్చటిస్తాను. భాషా వ్యాకరణ సూత్రాలను వివరించడం నా అభిమతం కాదు. కాలం రాపిడికి కొన్ని మాటలు ఎలా రూపు మార్చుకుంటాయో, కొత్తరుచులు తీర్చుకుంటాయో వివరిస్తాను.

'పనిజేసె' — మామూలుగా 'పనిసేసె' అని వుండాలి 'గసడదవాదేశ' సూత్రం ప్రకారం. కానీ తెలంగాణా జిల్లాల్లో సరళాదేశం వస్తుంటుంది. 'అటు జూసి', 'ఇటుజూసి', 'ఆదిజెప్పి', 'ఇదిజెప్పి' — అంతేకాదు — 'ఏంచేస్తాడు' అనడానికి 'ఏంజేస్తడ'ని వాడుక.

'కడుపంత ఉడుకు' — ఇందులోని 'ఉడుకు' తద్ధర్మార్థకక్రియ కాదు; విశేష్యం. అంటే 'తాపం' 'వేడి' అని తాత్పర్యం.

'శానేండ్లు' అంటే చాలా ఏండ్లు. 'చాలా' అనేమాట 'శానా' అనీ, 'శన' అనీ వాడుకలో వుంది. 'శానశాన బాగున్నవు', 'మా దగ్గర శన పండ్లున్నయి'.

షష్ఠీవిభక్తి ప్రత్యయమైన 'లో' ఈ ప్రాంతంలో 'ల' గా మారింది. 'పట్నంలో' 'పట్నంల' అయింది. "పట్నంల శాలిబండ, పేరైన గోలకొండ" అనే పల్లవి తరతరాలుగా పాడుకుంటున్న జానపదులది.

"ఫోటొ తీస్తానని
మాట తిప్పేసిండు" దొరకొడుకు.

'ఫొటో' 'పోటో'గా మారడం అంతటా వున్నదే! ఈ ప్రాంతంలోని కొన్ని జిల్లాల్లో 'పోటువ' అనే ప్రయోగంకూడా వుంది; వస్తువును 'వస్తువ' అన్నట్టు.

దొరకొడుకు ఆ పల్లెపడుచును ఆకట్టుకోవాలని రకరకాల వికారాలు చూపుతున్నాడు. 'ఏందయ్యా' అని అడిగేసరికి ఫోటో తీసే సాకుతో 'మాట తిప్పేసిండు'. మాట మార్చేయడానికి 'తిప్పేసిండు' అనడం ఈ పలుకుబడి విశేషం.

తెలంగాణమంతటా 'చేసినాడు', 'చెప్పినాడు' అనడానికి 'చేసిండు' 'చెప్పిండు' అనడం సామాన్యం. పూర్వగ్రాంధిక భాషలోనూ, ఇప్పటికీ రాయల సీమలోనూ వున్న 'చేసినాడు' వంటి క్రియారూపాల్లోని 'న'కారం అనుస్వారంగా మారి 'నా'లోని 'అ'కారాన్ని గిరాటువేసి 'చేసిండు'గా రూపొందింది. మరి కోస్తాప్రాంతాల్లోనో? 'న'కారం ఎగిరిపోయి చేసి+ఆడు చేశాడు గా మారింది-తాటాకులోని ఉచ్చారణను పుచ్చుకుని. ఇంతకూ ఈ 'చేసినాడు' కూడా మూల రూపం కాదు. దీనికి మూలం 'చేసినవాడు'. 'వచ్చినవాడు ఫల్గునుడు' అన్న తిక్కన్న ప్రయోగంలో వున్నది ఈ పదమే. ఇప్పుడు 'చేసినవాడు' 'చేశాడు' అన్న క్రియార్థంలో కాక 'ఎవడు చేశాడో వాడు' అనే కర్త అర్థంలో మిగిలి పోయింది.

చనువు ముదిరిన దొరకొడుకు లచ్చి కొంగు పట్టుకున్నాడు. ఆమె 'ఉరిమి సూసింది'. చూపులు పలురకాలు — వాలుచూపులు, ఓరచూపులు, వలపుచూపులు, చిలిపిచూపులు, కొసరుచూపులు, ముసురుచూపులు. కోపమొస్తే కోరచూపులు, కొరకొరచూపులు. ఆ కొరకొరచూపుల్లో వినిపించని ఉరుములు, కనిపించని పిడుగులు ఉంటాయి. 'ఉరిమి సూసేసరికి' అన్నమాటలో ఇంతటి అభివ్యక్తి ఉంది.

'ఒరుసుకొని ఒరుసుకొని'— మరీ దగ్గర దగ్గరగా ఆనుకొని. రాసుకొని, పూసుకొని తిరగడంలోని అర్థం ఒరుసుకొని తిరగడంలోనూ వుంది. మామూ

లుగా 'ఒరుసుకొని' అనే మాటలో రాపిడి అనే అర్థం ఉంది. ఒరగల్లులో ఉన్నదిదే.

లాభం లేదనుకున్నాడు దొరకొడుకు. 'చిలకా ముత్యాల గొలకా' అంటూ స్తోత్ర వాఙ్మయంలో పడ్డాడు. 'గెల' అనే మాట ఇక్కడ 'గొలక'గా మారింది. స్తోత్రాలతోపాటు "కైత్కాలు సూపించిండు". 'కైత్కాలు' అంటే 'కవిత్వాల'కు తద్భవం. ఇది లోగడ నేను చేసిన వివరణే.

పెళ్లికి 'పెండ్లి' అనడం, 'లగ్గం' అనడం రెండూ వాడుకలో ఉన్నవే. లగ్నం అంటే సుముహూర్తం. ఇది మొత్తం పెళ్లితంతుకే పర్యాయపదంగా నిలిచిపోయింది. ఈ పాటలో చివరిమాట 'ఇగరాడు — అగరాడు'. దీంట్లో 'ఇకరాడు' 'ఇగరాడ'య్యింది. మరి 'అగరాడు'? అది 'ఇగరాడు'కి కేవలం ఊతపదం. అయితే తెలంగాణంలోనే 'ఇగొస్తడు' 'అగొస్తడు' అనే వాడుక 'ఇదిగో వస్తాడు' 'అదిగో వస్తాడు' అనే అర్థంలో ఉంది. కానీ ఈ 'ఇగరాడు-అగరాడు'లో ఆ అర్థాన్ని సమన్వయించలేం. దీనికర్థం 'ఎంతకూ రాడు, అసలే రాడు, ససేమీ రాడు'— అంతే.

బొంబాయికి

పల్లవి ॥ పొట్ట నేతబట్టుకొనీ
బొంబాయికి యెల్లిపాయె
ఎట్ల వున్నడో। కొడుకు
ఏమి తిన్నడో। ॥పొట్ట॥

చరణం-1 : కాల్జేతులు సల్లగుంటె
కదురూమొగ్గం వుంటే
బతుకవచ్చు బిడ్డా అని
బతిమాలిన యినకపాయె। ॥పొట్ట॥

చరణం-2 : ఊరుగాని ఊరటా
దారిగాని దారటా
బాస తెలియనోల్లకు ఆ
పట్నం ఒక అడివట। ॥పొట॥

చరణం-3 : మూడొద్దుల కొక్కపారి
కోడికూర లేకుంటే
కంచమిసిరి కొట్టే నా
కన్నతండ్రి ఏమితినెనో? ॥పొట్ట॥

చరణం-4 : ఇంతపెద్ద యిల్లున్నా
ఇసుగుకునే యెర్రినాన్న
కోల్లగూడసొంటి మురికి
కొంపలోన ఎట్లుండెనో? ॥పొట్ట॥

చరణం-5 : ఏమి కొడుకు ఏమి కొడుకు
ఇగురమున్న చేతివొడుపు.
వానినేతముందు గిర్ని
బట్టలైన దిగదుడుపు। ॥పొట్ట॥

చరణం-6 : కొత్తలు పంపిస్తననీ
కొడుకు కారజేసెగాని
పానానికి సుకంలేంది
పైసల్ల ఏముంది ? ॥పొట్ట॥

ఊళ్లో చేనేతవృత్తితో జీవిక సాగక బొంబాయికి వెళ్లిపోయి, బట్టల మిల్లులో కార్మికుడుగా చేరిపోయిన ఒక పద్మశాలి యువకుని తల్లి కడుపుతీపి ఈ పాటలోని వస్తువు.

ఊళ్లో చేనేత వృత్తివల్ల వచ్చే రాబడికంటే, మిల్లులో కార్మికుడిగా చేరితే వచ్చే ఆదాయం మూడింతలు నాల్గింతలు. సంపాదనకేమి ? రెండుచేతులా. కానీ సదుపాయాలో ! నిండుసున్న. ఆ కన్నతల్లికి తెలుసు తన కొడుకు నాలుగు రాళ్లు వెనకేయాలని అక్కడ ఎంత కష్టపడుతున్నాడో ?

ఆ యువకుడు బొంబాయికి వెళ్లింది సరదాగా సూటీకేస్ చేతపట్టుకొని కాదు, "పొట్ట సేతబట్టుకొని". ఈ పలుకుబడి వెనక ఎంతటి దైన్యం వుంది ? 'పొట్టకోసం' అనే మాటకున్న అర్థాన్ని విచిత్రంగా ఇముడ్చుకున్న మాట ఇది.

తల్లి బాధ 'ఏమి సంపాదిస్తున్నాడో' అనికాదు. 'ఎలా ఉన్నాడో ?' 'ఏమి తిన్నాడో ?' అని. "తల్లి కడుపు జూస్తుంది—పెండ్లాం జేబు జూస్తుంది" అనే సామెత ఆ మాతృమూర్తి ఆర్తిలో ఎంత సహజంగా ధ్వనిస్తున్నది ?

'కాల్జేతులు' — ఇక్కడ గసదదవాదేశం మళ్లీ చతికిలబడిపోయింది. సరళాదేశం సంధిలో వచ్చి కూర్చుంది.

'కదురూ—మొగ్గం' — ఈ ప్రాంతంలో 'మగ్గం' మొగ్గం అయింది. కోస్తాప్రాంతాల్లో ఈ వాడుక లేదు. అక్కడ 'మగడు' 'మొగుడు' అయ్యాడు. ఇక్కడ ఆ 'మొగుడే' 'మొగడు'గా వున్నాడు.

'బతుకవచ్చు బిడ్డా !' — 'బిడ్డ' అనే మాటకు కొడుకు, కూతురు అనే రెండర్థాలున్నాయి. తెలంగాణంలో 'ఎందరు బిడ్డలు ?' అన్నప్పుడు ఎందరు కూతుళ్లు ? అనే అర్థం. కోస్తాప్రాంతాల్లో ఈ ప్రశ్నకు అర్థం సంతానం ఎంత మంది ? అని. ఆ పరిధిలో కూతుళ్లతోపాటు కొడుకులూ వస్తారు. అయితే మరో తమాషా వుంది. తెలంగాణంలో కోపంగానో వెటకారంగానో 'ఏంది బిడ్డా' అన్నప్పుడు అది పురుషులకు కూడా వర్తిస్తుంది. ఆప్యాయతను సూచించడానికి 'బిడ్డా' అనేపదం వాడుకలోవుంది. ఇక్కడ ఉన్నది ఆ కడుపుతీపే.

బొంబాయిలో వినిపించే భాష మరాఠీ, హిందీ, ఇంగ్లీషు. మరి తెలుగు గడ్డనుంచి అక్కడికి వెళ్లిన ఈ ఆమాయకుడు నాలుగు తెలుగుమాటలు తప్ప మరే భాషలోనూ మాట్లాడలేడు. ఎలా మరి ? ఆ తల్లి మనసు ఆ కలవరంతోనే అంటుంది —

"బాస తెలియనోల్లకు ఆ
పట్నం ఒక అడివట". అని.

'బాస' అనగానే వాగ్దానం గుర్తుకొస్తుంది. ప్రేమికులు జన్మజన్మల అనుబంధాలను తిరగేసి, చేతిలో చెయ్యేసి, బాసలు చేసుకుంటూ వుంటారు సినిమాల్లోనూ, అప్పుడప్పుడు సిసలు జీవితాల్లోనూ. "ఆ బాస నాకు తెలియదు", "ఏం బాసల మాట్లాడిండు" లాంటి తెలంగాణా ప్రయోగాల్లో ఉన్న 'బాస' భాషే. అయితే 'బాసచేసి మరిచిపోయిండు' లాంటి సందర్భాల్లో ఉన్నది వాగ్దానం అర్థంలోనే.

"మూడొద్దులు"— అంటే మూడునాళ్లు. దీని సంధికార్యం చిత్రంగా జరిగింది. మూడు+పొద్దులు. ఇదీ వరస. దీంట్లో 'ప' వర్ణం లోపించి మూడొద్దులుగా మారింది. ఒక్క 'మూడొద్దుల్లో'నే కాదు. రెండొద్దులు, నాల్గొద్దులు, ఆరొద్దులు, పదొద్దులు. ఇలా అన్నింట్లోనూ ఇదే జరిగింది. కోస్తా ప్రాంతాల్లో 'మూడు దినాల'కు 'మూన్నాళ్లు' 'ముడు రోజులు' అనే ప్రయోగాలున్నాయి. 'మూడు రోజుల' వాడుకే జాస్తి. ఇంతకూ ఈ 'రోజు' అనే మాట పచ్చి ఫారసీకం. మరి నేను వాడిన జాస్తిమాత్రం తెలుగుదా ? కాదు. 'జ్యాదతీ' అనే ఫారసీ పదానికి వికృతి. సంధిగతంగా జరిగే ఈ 'ప' వర్ణ లోపం కోస్తాప్రాంతాల్లో వేరే పదాల్లో వుంది. 'చెయ్యుచ్చుకున్నాడు', 'ముక్కట్టుకున్నాడు', 'ముద్దెట్టుకున్నాడు' వగైరాల్లో జరిగిం దిదే.

పాపం ఆ యువకుడుండేది ఇరుకుగదిలో, చాప పరిచినంత జాగాలో. ఇది తెలిసిన తల్లికి

"కోల్లగూడసొంటి మురికికొంప" కళ్లముందు నిలుస్తుంది. 'కోల్లగూడు +అసొంటి' — కోల్లగూడు అంటే కోల్లగూడే. చిన్నగది అన్న అర్థంలో చేసిన ప్రయోగం ఇది. 'ఉసొంటి' అనే పదం అటువంటి అనే పదం నుంచి పుట్టింది. 'అసుంటి', అసువంటి అనే రూపాలుకూడా వున్నాయి దీనికి.

ఆ యువకుడిది 'ఇగురమున్న' చేయట. 'ఇగురం' అంటే సేర్పు. ఇది 'వివరం' అనేమాటకు వికృతి. వివరం > ఇవరం > ఇగురం. ఇదీ క్రమం. అపదాది గకారం వకారమవ్వతుందని వ్యాకరణం చెబుతుంది. చిగురు>చివురు, నగు > నవు వగైరా. కానీ ఇక్కడ వకారం గకారంలోకి దిగింది. మాండలిక పదాల్లోని చమత్కార మిదే.

మిల్లుగుడ్డలను మొన్నమొన్నటివరకు తెలంగాణంలో 'గిర్నిబట్టలు' అనే వాళ్లు. మరి ఈ పాటలో 'కొత్తలు' మాటేమిటి? హైదరాబాదు రాష్ట్రం నైజాం పాలనలో వున్నప్పుడు ఇక్కడి కరెన్సీ వేరు. దాన్ని 'హాలీ' అనేవారు. 'హాలీ' అంటే ఇప్పటిది (Current) అని అర్థం. బ్రిటిషుపాలనలో వున్న బొంబాయి లాంటి రాష్ట్రాల్లోని కరెన్సీని నాటి హైదరాబాదీయులు 'కల్దార్' అనేవాళ్లు. హాలీకంటె కల్దార్ విలువ ఎక్కువ. ఆ కల్దార్ ఇక్కడివాళ్ల దృష్టిలో కొత్త నాణెం కదా! అందువల్ల ఆ కల్దార్ పైసలను 'కొత్తలు' అనేవాళ్లు. "వానికి కొత్త బుట్టదు", "కొత్తకు పనికిరాడు" లాంటి ప్రయోగాల్లోవున్న 'కొత్త'కు అర్థం పైసా.

'కారటేసె' — కార్డు+వేసె అన్నమాట. కార్డులోని సంయుక్తాక్షరం కారటులో పరుచుకుపోయింది. అసలు కార్డు వ్రాయడం కదా! కార్డు వేయడ మేమిటి? బహుశ: ఇది 'ఉత్డాల్నా' (ఉత్తరం వేయడం) అనే ఉర్దూ ప్రయోగం పాదులో పుట్టిందేమో!

బావ యెప్పుడొస్తడే?

పల్లవి ॥ బావ యెప్పుడొస్తడే లేగదూడా । నా
పాన మాగకున్నదే ఇంటికాడ । ॥బావ॥

చరణం-1 : పువ్వులంటె మనుసు లేదు
బువ్వమీద బుద్ధిపోదు ।
పొంటెజాము పరుపుమీద
పొర్లిన కన్నంటుకోదు । ॥బావ॥

చరణం-2 : బీరపూల పందిరేమొ
బీరిపోయి సూసింది ।
మొగులు మీది సందమావ
బుగులు బుగులు రేపింది । ॥బావ॥

చరణం-3 : మునివాకిట ఏ యెద్దుల
మువ్వల సప్పుడు విన్నా
బావ యెక్కి వచ్చేటి స
వారి కచ్చమనుకున్న । ॥బావ॥

చరణం-4 : బావపేర చీటి రాసి
బరువుదించుకుందమంటె
సిన్నప్పుడు నాల్గునుడుగు
లన్న సదువుకోనైతిని । ॥బావ॥

వలపు కబురు పంపడానికి చిలకలున్నాయి, హంసలున్నాయి, మబ్బుతునక లున్నాయి. కాపుపడుచుకు రోజూ కట్టెదుట కనిపించేది లేగదూడే. 'బావ యెప్పుడొస్తాడ'ని ఆ లేగ నడుగుతుంది. తనమనసుపొరల్లో ఒదిగిన కల్లోలాన్ని ఏకరువు పెడుతుంది.

'యెప్పుడొస్తడు'-'వస్తాడు' వంటి క్రియల్లోని దీర్ఘం హ్రస్వం కావడం ఇక్కడ సర్వసామాన్యం. గోదావరి దాటినకొద్దీ క్రియలకు లాగుల్లు అధికం. తెలంగాణం నడిగడ్డలోకి చొచ్చినకొద్దీ కుదింపులు మెండు.

బావమీది ధ్యాసతో ఆ కాపుపడుచుకు 'అరతి' అనే మన్మథావస్థ ఏర్పడింది. పూలమీద మనసు లేదు. సరే! "బువ్వమీద బుద్ధిపోదు". అంటే — అన్నం సయించడం లేదన్నమాట.

దీంట్లోనే 'పొంటెజాము' అనే మరోమాట వుంది. దీని అర్థం చాలాసేపు అని. 'పొంటె' అంటే నిఘంటువు చెప్పే అర్థం 'కొరకు' అని. "లోక హితంబు పొంటె"— ఇది నన్నయ ఆదిపర్వంలోని ప్రయోగం. మరి మాండలికంగా వున్న 'పొంటె' అర్థం వేరు.

"నిద్ర పట్టలేదు" అనడానికి 'కన్నంటుకోదు' అనే ప్రయోగం ఎంత కమనీయం!

'బీరిపోయి' — అంటే బిత్తరపడి, ఆశ్చర్యంగా అనే అర్థాల్లో ఈ ప్రాంతంలో వాడుతుంటారు. 'ఆది జూసి నేను బీరిపోతిని' వంటివి ఎప్పుడూ వినేవే. దీని మూలరూపం "బీరువోవు". దీనికి నిఘంటువుచెప్పే అర్థం 'బలహీనమగు' అని. 'పొడిచిన వెస బీఱువోవక' — ఇది విరాటపర్వంలో తిక్కన్న ప్రయోగం. అనుకోనిది జరిగినప్పుడు ముఖం వెలవెలబోతుంది. బిత్తరచూపు లేర్పడతాయి. ఇదే 'బీరువోవడం', 'బీరిపోవడం'.

'సవారికచ్రం'—పది ఇరవై ఏళ్లక్రితం తెలంగాణంలో పల్లెపల్లెకూ నేటి జీపుల్లా దూసుకుపోయే 'సవారి బండ్లు'ండేవి. ఒక ఊరినుంచి మరొక ఊరికి, పల్లెనుంచి తాలూకా కేంద్రానికి వెళ్లాలంటే కలవాళ్లూ, మోతుబరిరైతులూ ఈ బండ్లను ఉపయోగించేవాళ్లు. సవారిబండినే కొన్నిజిల్లాల్లో 'సవారికచ్రం' అంటారు. 'కచ్చడం' అంటే కౌపినం (గోచీ) అనే అర్థంతోపాటు బండి అని

కూడా చెబుతుంది నిఘంటువు. ఇది యుగళపదం. అంటే ఒక అర్థంలో దేశ్యం. ఒక అర్థంలో వైకృతం. కౌపినార్థంలో ఇది దేశ్యం కావచ్చు. కానీ బండి అనే అర్థంలో వైకృతమేమో అనిపిస్తుంది. పూర్వం కంచరగాడిదలను బరువులు మోయడానికీ, బండు లాగడానికీ ఉపయోగించేవారు. కంచరగాడిదను పారసీలో 'ఖచ్చర్' అంటారు. బహుశ: ఆ 'ఖచ్చర్'లను కట్టే బండ్లు కావడం వల్ల 'కచ్చరాలు' అనే మాట వాడుకకెక్కి వుంటుంది.

అంతగా బావకోసం కలవరించే ఆ కన్నెపిల్ల నోరులేని లేగదూడతో ఎందుకు చెప్పుకోవాలి? ఒక చీటికాసి పడేస్తే రెక్కలు గట్టుకొని బావ వాలడా ఆమె ముంగిట్లో. ఇక్కడే ఒక విచిత్రమైన మూగనిజం వుంది. ఆమె

"సిన్నప్పుడు నాల్గునుడుగు
లన్న సదువుకో"లేదు పాపం.

'నుడుగులు' అంటే మాటలు, పంక్తులు, చరణాలు. "ఒక నుడుగినిపించు" అంటూ పాట పాడేవాళ్లను అడగడం పరిపాటి. 'నుడుగు' అంటే 'చెప్పు' అనే అర్థంలో ప్రాచీనకావ్యాల్లో అగుపడుతుంది. మరి 'నుడువరి' అంటే వాచాలుడు. అదుగో అలా పాతకావ్యాల్లో మాత్రమే తలదాచుకున్న ఆ 'నుడుగు' తెలంగాణంలో పల్లీయుల నాలుక కొసలపైన ఇప్పటికీ ఎంత పసందుగా పలుకుతున్నదో!

సి.పి. బ్రౌన్ సాహిత్య గ్రంథాగారం
ప్రవేశ సంఖ్య
తేది
కడప - 516 004.

ఏమి మొగడో!

పలవి ॥ వద్దంటె యినడేమి మొగడో! తాగ
వద్దంటె యినడెంత అగడో। ॥వద్దంటె॥

చరణం-1 : రెండు జాములదాక
ఎండైన వానైన
సాకిరేవే తప్ప
లోకమే యెరుగడు।
పొద్దు వంగిందంటె
బుద్ధి మల్లిందంటె
కల్లంగడే తప్ప
కడమదేమెరుగడు। ॥వద్దంటె॥

చరణం-2 : గురి కుదిరెనా ఎంత
మురికి బొంతలనైన
మల్లెపువ్వుల వతుగ
తెల్లంగ ఉతుకుతడు।
పీటేసి కూసుంటె
పెద్ద బుంగెడు కల్లు
దమ్ము తిప్పక తాగి
తైతక్కలాడుతడు। ॥వద్దంటె॥

చరణం-3 : రాతిరేమో బండ
బూతులను యిప్పుతడు।
పొద్దు పొడువంగనే
సుద్దులను జెప్పుతడు।

కడుపులో ఒక బింకి
కల్లు ఉరికిందంటె
దేవునసువంటోడు
దయ్యమై తూలతడు ; ॥వద్దంటె॥

చరణం-4 : తిటినా కొటినా
కట్టుకున్నోడసి
ఎట్టెట్టనో ఉగ్గ
బట్టుకుంటిని గాని;
"మళ్లి నీ మొగడు దొ
మ్మరి గుడినె లేలె" నని
పొరుగమ్మ లంటె తల
వరికేసినట్టాయె ; ॥వద్దంటె॥

తన మొగుడు బట్టలుతకడంలో దిట్ట. ఉన్న లోపమల్లా తాగుడు. మల్లికి తన మొగుడంటే వల్లమాలిన ప్రీతి. ఆ తాగుడు దగ్గరే వస్తుంది చిక్కంతా. 'వద్దు ; తాగవద్దు !' అంటూ మొత్తుకున్నా వినడతడు. తాగుడంటే అతనికి ఎంత అగడు ; 'అగడ'ంటే ఆసక్తి, ఆబ, అధికాశ. ప్రాచీనకావ్యాల్లో 'అగడుపడు' అంటే 'దూఱుపడు' 'తొట్రుపడు' అనే అర్థాల్లో ప్రయోగాలున్నాయి. మాండలికంగా ఆ అర్థాలు మారిపోయాయి.

"బుద్ధి మల్లిందంటె"—ఆ మడేలు
"కల్లంగడే తప్ప
కడమదేమెరుగడు".

మిగతా అనడానికి 'కడమది' అనే పదం వాడుకలో వుండిక్కడ.

బట్టలుతకడంలో అతని పనితనాన్ని నెమరువేసుకుంటూ భార్య అన్న మాటల్లో 'వతుగ' అనే ప్రయోగం చాలా తమాషాగా వుంది. 'మల్లెపువ్వుల వతుగ' అంటే 'మల్లెల్లాగా' అని. ఈ 'వతుగ'లో ఉన్నది సంస్కృతపదమైన

'వత్' (వలె). హలంతమైన 'వత్' అమాంతంగా అజంతమైపోయి, అచ్చ తెనుగు తావిని పుక్కిలిస్తున్నది.

'బండబూతులను యిప్పతడు' అనే వాక్యంలో ముచ్చటైన నుడికారం ఉంది. బూతులు ముదిరితే బండబూతులు. తెలుగునాడంతటా ఈ మాట చెలామణిలో వుంది. కానీ 'బండబూతులను యిప్పడం' మాండలికం. "ఏమి టయ్యో పంచాగం ఇప్పతున్నవ్' వంటి ప్రయోగాలు వాడుకలో వున్నాయి. ఆ వరసలోనే కుదిరింది ఈ బూతులను విప్పడం.

తెలంగాణంలో పరమ గ్రాంధికరూపాలు కొన్ని రోజువారీ వ్యవహారంలో తారసిల్లుతాయి. 'పొడువంగనే' అలాంటి మాటే. 'పొడువఁగ'లో వున్న అర సున్న పూర్ణానుస్వారంగా పొడుచుకొచ్చింది. ఇలాంటి రూపాలే తినంగనే, వినంగనే, చెప్పంగనే, చెయ్యంగనే.

కల్లుపాత్రల పేర్లు రకరకాలు. సైజునుబట్టి ఏర్పడ్డ పేర్లివి. పెద్దదైతే అది కల్లుకుండ. చిన్నదైతే లొట్టి. మరీ చిన్నదైతే బింకి. 'కల్లుముంత' అనే ప్రయోగం ఈ ప్రాంతఁలో లేదు. 'ముంత' అనే మాట బహిర్భూమికి వెళ్లేటప్పుడు తీసుకుపోయే పాత్ర. "ముంత బట్టుకొని పోయిండు" అన్న వాక్యంలోనిది ఆ ముంతే.

తాగుబోతుల్లో కొందరికి కల్లువాసన చూస్తేనే కళ్లు తిరిగిపోతాయి. రెండు గుక్కలు తాగితే గుండెలో హుషారు పుడుతుంది. ఒక్క 'బింకి' కల్లు తాగితేనే మన మడేలుకు నెత్తిలో దయ్యం తైతక్కలాడుతుంది.

ఈ పాటలో 'ఉగ్గబట్టుకోవడం' అనే మాటుంది; అణచుకోవడం, దాచుకోవడం అనే అర్థంలో.

మల్లి తన తాగుబోతు మొగుడు తిట్టినా, కొట్టినా, కట్టుకున్నోడుకదా అని "ఎట్టెట్టనో ఉగ్గబట్టు"కుంది.

తన మొగుడు కొట్టినా ఓర్చుకుంటుంది కానీ, దొమ్మరిగుడిసెలేలుతున్నా డని పొరుగమ్మలంటే తల నరికేసినట్టైంది. 'గుడిసెలేలె' — 'ఏలె' అనే ప్రయోగం 'ఏలినాడు' అనే అర్థంలో వుంది. 'చెప్పె', 'చేసె' మొదలైన భూతకాలార్థక గ్రాంథిక క్రియలు యథాతథంగా ఇక్కడ వాడుకలో ఉన్నాయి. 'ఏలె' ఆ కోవకు చెందిందే.

సెల్లెలా!

పల్లవి ॥ సావుకాలం వచ్చె సెల్లెలా। మా సెడ్డ
గావుకాలం వచ్చె సెల్లెలా। ॥సావు॥

చరణం-1 : పాడు వరదలూ వచ్చి
పల్లెనే ముంచేసె।
పంటకెదిగిన పైరు
పచ్చలను కాజేసె।
ఏమితిని బతుకుదము సెల్లెలా। ఇకముందు
ఎట్లెట్ల గడుపుదము సెల్లెలా। ॥సావు॥

చరణం-2 : పాపిసి వరదలకు
పాక కొట్టుకపోయె।
నిల్లువనీడే లేని
అలిపిరీ బతుకాయె।
మీదున్న ఆ మొగులె సెల్లెలా। మన కింక
మీద దిక్కౌనేమొ సెల్లెలా। ॥సావు॥

చరణం-3 : కన్నీల్లు తాగైన
కడుపు నింపుదమంటె
వడిలి పోయిన కంట
తడిగూడ కరువాయె।
గుడికెల్లి మొక్కితే సెల్లెలా। అయ్యొ అ
క్కడ రాయె ఎదురాయె సెల్లెలా। ॥సావు॥

చరణం-4 : అప్పొ సప్పొ జేసి
ముప్పుతిప్పలు పడీ

ఎట్లనో మన యెవుస
మీద్చుకొస్తామంటె
కొత్తపంటమ్మితే సెల్లెలా। సొకారు
మిత్తికే సరిపోదు సెల్లెలా! ॥సావు॥

చరణం-5: ఇయ్యేడె నీ పెండ్లి
ఎట్లైన జేస్తనని
అయ్య సావంగ బా
ర్లైతె జేస్తిని గాని
నా మాట పొలాయె సెల్లెలా। ఇంక నా
నాల్క తెగిపోదాయె సెల్లెలా। ॥సావు॥

పాడు వరదలు వచ్చి పల్లెను, పైరును, తలదాచుకునే పూరిపాకను ముంచేయగా, ఒక సన్నకారురైతు పొందిన ఆవేదన ఈ పాటలో తెరలు తెరలుగా పొరలి పోతున్నది. తనకు నా అనే వారెవరులేరు ఒక్కచెల్లెలు తప్ప. ఆ చెల్లెలితో చెప్పుకుంటున్నాడు తనగోడు. తనకు కలిగిన ఆ దుస్థితిని 'గావుకాలం' అన్నాడు. 'గావు' అంటే బలి. బోనాలపండగ పూట గొర్రెలనూ, మేకలనూ బలి ఇచ్చేటప్పుడు (ఒకప్పుడు) పెట్టేకేక గావుకేక. అలాంటి కిరాతకకాలం గావుకాలం.

వరదల ఆధూయిత్యం వల్ల వాళ్లది 'అలిపిరి' బ్రతుకైపోయింది. 'అల్ప' శబ్దానికి వికృతి అలిపిరి. తత్సమం లోని సంయుక్తాక్షరత పోవడం వల్ల ఈ పదం తద్భవంలో చాలా తేలికగా తయారైంది.

'మొగులు' అనేమాట ఇక్కడ ఆకాశం అనే అర్థంలో వుంది. ప్రాచీన అర్వాచీన కావ్యాల్లో 'మొగులు', 'మొగిలు', 'మొయిలు' అనే ప్రయోగాలు మేఘం అనే అర్థంలో ఉన్నాయి. 'మొగులు దారి', 'మొయిలు దారి' అంటే మబ్బుల దారి అనే అర్థం. కేవలం మేఘపరంగా వున్న మొగులు ఈ ప్రాంతంలో ఆకాశంగా విస్తరించింది.

వ్యవసాయానికి మాండలిక రూపం 'యెవుసాయం', 'యెవుసం'. మరి 'మిత్తి' అంటే మృత్యు శబ్దవికృతి కాదు; వడ్డి. ఈ సందర్భంలో పేర్కొన దగిన ఉర్దూమాటలు మూడున్నాయి. 1. అసల్ 2. ముద్దత్ 3. షరహ్. అసల్ అంటే అసలే. ఇక ముద్దత్ అంటే మితి. ఒక గడువులో అసలు డబ్బు షరహ్ (వడ్డీరేటు)తో సహా ఇచ్చేయాలనే ఏర్పాటు. బహుశః 'ముద్దత్' ముద్దతీగా మారి 'మిత్తి' అయివుంటుంది. లేక 'మితి'యే 'మిత్తి'గా మారి పోయిందో. మొత్తానికి మిత్తి సన్నకారు రైతుల పాలిటి మిత్తే (మృత్యువే).

సర్కారు ప్రాంతంలో 'షావుకారు' గా ప్రచలితంగా వున్న పదం హిందీలోని 'సాహూకార్' నుంచి వచ్చింది. తెలంగాణంలో ఆ పదమే 'సాకారు' గా మిగిలిపోయింది.

'ఇయ్యేడు' అనే పదంలోని త్రికసంధి ఇక్కడి వ్యవహారంలో ఉన్నదే. ఈ సంవత్సరం అనడానికి 'ఇయ్యేడు' బాగా వాడుకలో ఉన్నమాట.

అయిదేండ్లకోసారి

పల్లవి ॥ కోల్లు దినేటోలు పోయి
గొర్లు దినేటోల్లొచ్చిరి
అయిదేండ్లకు కనిపిచ్చిరి
ఐకుంటం జూపిచ్చిరి। ॥కోల్లు॥

చరణం-1 : బడి పెట్టిస్తామనిరి
గుడి గట్టిస్తామనిరి
బడికో సున్నా జుట్టిరి
గుడికో నామం బెట్టిరి। ॥కోల్లు॥

చరణం-2 : కంకర రోడ్డేస్తమనిరి
కరెంటు తెప్పిస్తమనిరి
అడ్డమైన పైస గుంజి
బిడ్డల లగ్గాల్ జేసిరి। ॥కోల్లు॥

చరణం-3 : పజల రాజ్జె మనబట్టిరి
పంచాయితిలని పెట్టిరి
పజలపేరు జెప్పుకొనీ
కజానాలు కాజేసిరి। ॥కోల్లు॥

చరణం-4 : సబల మీద సబలుబెట్టి
సదివిందూదర గొట్టిరి
సివారు దాటంగానే
సెప్పింది వొదిలిపెట్టిరి। ॥కోల్లు॥

చరణం-5 : గాందిపేర 'జై' కొట్టిరి
కల్లంటే 'చీ' కొట్టిరి
తెల్లార్లూ పెద్దొరింట్ల
నల్లసీస లొడగొట్టిరి। ॥కోల్లు॥

తెలంగాణంలో నైజాం పాలన అంతరించి ప్రజాప్రభుత్వం వీర్పడినప్పుడు కొందరు నాయకుల దోపిడిని కనిపెట్టిన గ్రామీణులు

"కోల్లు దినేటోల్లు పోయి
గొర్లు దినేటోల్లొచ్చిరి"

అంటూవుంటే ఎక్కోసార్లు విన్నాను. అదే పల్లవిగా అందుకున్నాను.

'గొర్రెలు' గొర్లుగా మారడం, 'బర్రెలు' 'బర్లు'గా మారడం ఇక్కడి పరిపాటి. ఇదేమిటి? అని ఎదురు ప్రశ్నిస్తే ఆ 'గొర్లు' గొర్రెలుగా తిరగబడతాయి సుమా! ఈ వర్ణవ్యత్యయాన్ని మాండలికాలకు అన్వయిస్తూ ఎప్పుడో నేనుదాహరించిన వాక్యం గుర్తుకొస్తున్నది.

"గొర్రూ, బర్రూ, చెర్రబడ్డయ్
మర్రేసుకొనిరా."

'కనిపించిరి', 'చూపించిరి' అనే మాటల్లోని అనుస్వారం మాయమైపోయింది. 'చి' అనే వర్ణం ద్విత్వంగా మారిపోయింది. ఇలాంటి క్రియారూపాలు తెలంగాణంలోని అన్ని జిల్లాల్లో పరివ్యాప్తంగా వున్నాయి.

డబ్బు కాజేయడం అనే అర్థంలో సర్కారుప్రాంతంలో డబ్బులాగుతాడు అని వాడుక. ఇక్కడ లాగడానికి గుంజడం ప్రచురంగా కనిపిస్తుంది.

ఉపన్యాసాలు తెగదంచుతూవుంటే దాన్ని 'ఊదరగొట్టడం' అంటారు.

సివారు అంటే ఊరి పొలిమేర. ఈ పదం హిందీలో నుండి ఉర్దూలోకి వచ్చింది. గ్రామాధికారుల రికార్డుల్లో చోటు సంపాదించుకుంది.

ఈ పాటలో చివరి ముక్తాయింపు "నల్లసిస లొడగొట్టిరి." అయిదేళ్లకో సారి అగుపించిన ఆసాములు, 'మహాత్మాగాంధీకిజై' అనడం, మద్యపాననిషేధ ప్రస్తావన చెయ్యడం మామూలే కదా! కల్లు తాగొద్దని వేదికలపైన ప్రవచించిన ఆ ప్రబోధకులు తెల్లవార్లూ ఆ వూరి పెద్దదొరగారింట్లో చేసిన పారాయణం "నల్లసిసలు ఒడగొట్టడం." తాటికల్లునూ, ఈతకల్లునూ తెల్లకల్లు అంటారు. కాచిన సారాను నల్లకల్లు అంటారు. విందుకు పిలిస్తే 'తెల్లదా? నల్లదా? అని

అడిగి కొందరు వ్యంగ్యవైభవాన్ని వెలారుస్తారు. 'నల్లసీస'లంటె సారాసీసాలు. వెనకటి రోజుల్లో ఇప్పటి లాగా కల్లును సీసాల్లో అమ్మేవాళ్లు కాదు. కుండలతో, పటువలతో, లొట్లతో, బింకులతో అందించేవాళ్ళు. కొందరు గ్లాసుల్లో, చిప్పల్లో తాగితే, కొందరు మోదుగాకులతో తాగేవాళ్లు. ఇప్పటికి చెట్లకింద తాగేవాళ్లకు మోదుగాకులే పానపాత్రలు.

ఒడగొట్టడం అంటే 'ఖాళీ చేయడం', 'ఒడిసిపోయింది' అంటే 'అయి పోయింది'—ఇది లోగడ చర్చించిన పదమే. అప్పుడే ఒడగొట్టినవా? అనేది వ్యవహారంలో వున్నమాటే.

Prof. B. Rama Raju (Rtd
H. No. 1-8-117/2, Chikkadpally,
HYDERABAD - 500 020.

డా॥ సి. నారాయణరెడ్డి

ప్రచురిత రచనలు

1970 — 1979

మంటలూ - మానవుడూ (వచన కవితలు)

ముఖాముఖి (వచన కవితలు)

మనిషీ - చిలక (వచన కవితలు)

మందార మకరందాలు (పోతన పద్యాలకు వ్యాఖ్యలు)

ఉదయం నా హృదయం (వచన కవితలు)

మార్పు నా తీర్పు (కవితాసంపుటి)

మీరాబాయి (మీరాబాయి పదావళికి అనువాదాలు)

తేజస్సు నా తపస్సు (కవితాసంపుటి)

తరతరాల తెలుగువెలుగు (నృత్యగేయరూపకం)

పగలే వెన్నెల (సినీగీతాల సంకలనం)

ఇంటిపేరు చైతన్యం (కవితాసంపుటి)

భూమిక (కావ్యం)

మథనం (కావ్యం)

ముత్యాల కోకిల (సరోజిని నాయుడు ఆంగ్లకవితల అనువాదాలు)

మృత్యువు [illegible] (కవితాసంపుటి)



Maavooru Maatlaadindi

by

Dr. C. Narayana Reddy

సి.పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయము
ప్రవేశ సంఖ్య 21345
తేది
కడప - 516 004.

Manaswini Prachuranalu
Hyderabad